సంచిక 1 – మార్చి 2015

# LEISA INDIA

# లీసా ఇండియా

## తెలుగు ప్రత్యేక ప్రచురణ

***Magazine on Low External Input Sustainable Agriculture***
***Compilation of Selected translated articles into Telugu***

తక్కువ బాహ్య ఉత్పాదకాలను ఉపయోగించి చేసే సుస్థిర వ్యవసాయ పత్రిక
తెలుగులోకి అనువదించిన కొన్ని వ్యాసాల సంకలనం



# లీసా ఇండియా

జనవరి 2015, సంచిక 1

ఈ సంచికలో వ్యాసాలు లీసా ఇండియా పత్రికలో ప్రచురితమైన ఆంగ్ల వ్యాసాల నుండి ఎంపిక చేయబడ్డవి.


**ఎ.యమ్.ఇ. ఫౌండేషన్**

నం. 204, 100 ఫీట్ రింగ్ రోడ్, మూడవ స్టేజ్,
రెండవ ఫేస్, బనశంకరి, బెంగళూరు – 560085
ఫోన్ : +91 080 26699512
+91 080 26699522
ఫ్యాక్స్ : +91 080 26699410
email: amebang@giasbg01.vsnl.net.in



**లీసా ఇండియా** ఆంగ్లంలో లీసా ఇండియా పత్రికను ఎ.యమ్.ఇ. ఫౌండేషన్ వారు ఇలియా వారి సహకారంతో ప్రచురించుచున్నారు.

**చీఫ్ ఎడిటర్** కె.వి.యస్. ప్రసాద్

**మేనేజింగ్ ఎడిటర్** టి.యమ్. రాధ

**అనువాదం** సుగుణశ్రీ మద్దాల

**అనువాద సమన్వయం** అరుణకుమార్ శివరాయ

**అడ్మినిస్ట్రేషన్** రుక్మిణి జి. జి.

**డిజైన్ లేఔట్** శ్రీ సాయి క్రియేటివ్ డిజైనర్స్, హైదరాబాద్.

**ముద్రణ** స్పాన్ ప్రింట్, బెంగళూరు

**కవర్ ఫోటో** కంది పంటలో చీడ పురుగులకు ఎరను అమరుస్తున్న కర్నాటకకు చెందిన మహిళా రైతు

**ఫోటో** ఎ.యమ్.ఇ.ఎఫ్

**లీసా మేగజైన్**
**ఇతర ఎడిషన్లు**
లాటిన్ అమెరికన్, వెస్ట్ ఆఫ్రికన్,
బ్రెజిలియన్ మరియు చైనీస్ ఎడిషన్

**లీసా ఇండియా మేగజైన్**
**ఇతర ప్రాంతీయ ఎడిషన్లు**
హిందీ, ఒరియా, తమిళ్, కన్నడ, మరాఠీ, పంజాబీ



ఈ పత్రిక నందలి అంశములు సాధ్యమైనంత ఖచ్చితత్వాన్ని కలిగి వుండుటకు ఎడిటర్లు అన్ని జాగ్రత్తలను తీసుకోవడం జరిగినది. వ్యక్తిగతంగా వ్రాసిన ఆర్టికల్స్‌కు ఆ రచయితలే బాధ్యత వహించెదరు.

ఈ పత్రికలోని వ్యాసాలను ఫోటోకాపి తీసి మిగతా వారికి ఇవ్వడాన్ని ఎడిటర్స్ ప్రోత్సహిస్తారు.



మిసెరియార్ వారి తోడ్పాటుతో ఎ.యమ్.ఇ.ఎఫ్. వారిచే ప్రచురితం


## లీసా LEISA www.leisaindia.org

లీసా అంటే తక్కువ బాహ్య ఉత్పాదకాలను ఉపయోగించి చేసేటటువంటి సుస్థిర వ్యవసాయం. ఇది సామాజిక మరియు సాంకేతిక పరమైన విషయాలను జోడించి రైతులు పర్యావరణాన్ని పరిరక్షిస్తూ తమ యొక్క ఉత్పాదకత మరియు ఆదాయాన్ని పెంచుకొనుట గురించి పనిచేస్తుంది. లీసా అనునది స్థానిక వనరులను మరియు సహజ ప్రక్రియలను సరియగు విధంగా ఉపయోగిస్తూ అవసరమైతేనే బాహ్య ఉత్పాదకాలు (ఇన్‌పుట్స్) ఉపయోగించుకొనుట గురించి తెలియజేస్తుంది. ఇది స్త్రీ, పురుష రైతులు వారి విజ్ఞానం, నైపుణ్యం, విలువలు, సంస్కృతి మరియు సంస్థల ఆధారంగా సాధికారతను సాధించి భవిష్యత్తును నిర్మించుకొనుట కొరకు ఉపయోగపడుతుంది. అంతేకాక భాగస్వామ్య పద్ధతుల ద్వారా రైతుల మరియు ఇతరుల యొక్క సామర్ధ్యాలను పెంపొందించి, మారుతున్న అవసరాలు మరియు పరిస్థితులకనుగుణంగా వ్యవసాయ వృద్ధిని సాధించుట లీసా లక్ష్యం. సాంప్రదాయ మరియు శాస్త్రీయ విజ్ఞాన పద్ధతులను జోడించి విధాన పరమైన నిర్ణయాలను ప్రభావితం చేసి తదుపరి అభివృద్ధికి సరియైన బాటను పరచటం లీసా యొక్క ప్రధాన ఉద్దేశ్యం. లీసా అనునది ఒక భావన, ఒక విధానం మరియు ఒక రాజకీయ సందేశం.

## ఎ.యమ్.ఇ. ఫౌండేషన్ AMEF www.amefound.org

ఎ.యమ్.ఇ. ఫౌండేషన్ దక్కన్ పీఠభూమిలోని చిన్న, సన్నకారు రైతులతో కలిసి ప్రత్యామ్నాయ సాగు పద్ధతులను రూపొందించి, విజ్ఞానాన్ని పెంపొందించి, శిక్షణను అందించి, వివిధ అభివృద్ధి సంస్థలను అనుసంధానించి అనుభవాలను పంచుకుంటుంది.


ధర్మకర్తలు

| | | |
|---|---|---|
| చైర్మన్ | : | శ్రీ చిరంజీవ్ సింగ్, ఐ.ఎ.ఎస్ |
| సభ్యులు | : | డా. ఆర్. ద్వారకీనాథ్ , డా. విఠల్ రాజన్, డా. ఎన్. జి. హెగ్డే, ప్రొ॥ వి. వీరభద్రయ్య, డా. ఎం. మహదేవప్ప, డా. టి.ఎం. త్యాగరాజన్, డా. ఎ. రాజన్న |
| కోశాధికారి | : | శ్రీ బి.కె. శివరాం |
| ఎగ్జిక్యూటివ్ డైరక్టర్ | : | శ్రీ కె.వి.ఎస్. ప్రసాద్ |


## మిసెరియార్ MISEREOR www.misereor.org

మిసెరియార్, అభివృద్ధి సహకారానికై 1958లో స్థాపించబడిన జర్మన్ కాథోలిక్ బిషప్పుల సంస్థ. ఈ సంస్థ 50 ఏళ్ళకు పైగా ఆఫ్రికా, ఆసియా మరియు లాటిన్ అమెరికా దేశాలలో దారిద్ర్య నిర్మూలనకు కృషి చేస్తూ ఉన్నది. జాతి, మత, లింగ భేదాలతో నిమిత్తం లేకుండా, అవసరంలో ఉన్న ఏ మనిషికైనా మిసెరియార్ సంస్థ తోడ్పాటు లభిస్తుంది.

పేద ప్రజలు, ప్రతికూల పరిస్థితులలో ఉన్నవారు స్వయంగా చేపట్టే ప్రయత్నాలకు మిసెరియార్ సహాయపడుతుంది. మిసెరియార్ స్థానిక సంస్థలతో - చర్చికి సంబంధించిన సంస్థలతో, ప్రభుత్వేతర సంస్థలతో, సామాజిక ఉద్యమాలతో మరియు పరిశోధనా సంస్థలతో కలిసి పనిచేస్తుంది. లబ్దిదారులతో కలిసి ఈ భాగస్వామ్య సంస్థలు స్థానిక అభివృద్ధి విధానాల రూపకల్పనకు, ప్రాజెక్టుల అమలుకు తోడ్పడతాయి. ఈ విధంగా మిసెరియార్ సంస్థ, తన భాగస్వామ్య సంస్థలతో కలిసి నిరంతరం మారుతున్న సవాళ్ళకు ప్రతిస్పందిస్తుంది.

ప్రియ పాఠకులారా,

ఈ మార్చి 2015 సంచికను మీతో పంచుకోవడం మాకు చాలా ఆనందం గా ఉంది.

వరి పంటలో శ్రీసాగు పద్ధతిలాగే చెరకు సాగులో కూడా ఎస్.ఎస్.ఐ. విధానాన్ని చేపట్టడం ద్వారా తక్కువ వనరులతోనే పంట నాణ్యతను, దిగుబడిని పెంచుకోవచ్చని రైతులు తెలుసుకున్నారు. ఈ సంచికలోని ఎస్.ఎస్.ఐ. గురించిన వ్యాసం ఈ విషయాన్ని ప్రముఖంగా తెలియజేస్తుంది.

ఈ సంచికలోని ఇతర వ్యాసాలు, వ్యవసాయంపట్ల ఆసక్తి ఉన్న యువత కొరకు ఆవిర్భవిస్తున్న విద్యానమూనాలు మరియు సంస్థల గురించి వివరిస్తాయి. ఉదాహరణకి 'స్కూల్ ఆఫ్ బయోడైనమిక్ ఫార్మింగ్' అనే సంస్థ యువతకు సుస్థిర వ్యవసాయంలో సమగ్రమైన శిక్షణను అందిస్తోంది. ప్లాంట్ హెల్త్ క్లినిక్స్ (వృక్ష వైద్యశాలలు) వంటి కొత్త తరహా నమూనాలు రైతులను శాస్త్రీయ పరిజ్ఞానంతో అనుసంధానం చేసే ప్రయత్నాలు చేస్తున్నాయి.

ఈ వ్యాసాలపై మీ అమూల్యమైన అభిప్రాయాలను, ఆలోచనలను మా వెబ్‌సైట్ మీద కానీ, పోస్టు లేదా ఈ-మెయిల్ (leisaindia@yahoo.co.in) ద్వారా కానీ మాకు తెలియచేయగలరు. నిరంతరమైన మీ ప్రతిస్పందనకై మేము ఎదురుచూస్తూ ఉంటాము. మీ రైతుమిత్రులు ఎవరైనా ఈ పత్రికను చదవాలని మీరనుకుంటే, వారి పూర్తి తపాలా చిరునామా మాకు పంపిస్తే, మేము వారికి ఈ పత్రికను పంపడానికి సంతోషిస్తాము.

సంపాదకులు




**ప్లాంట్ హెల్త్ క్లినిక్స్ : రైతులను శాస్త్రీయ ...........................టిఫే ఫర్హానా**

ప్లాంట్ హెల్త్ క్లినిక్స్ (వృక్ష వైద్యశాలలు) అన్నది బంగ్లాదేశ్ రైస్ రిసర్చ్ ఇన్స్టిట్యూట్ (బంగ్లాదేశ్ వరి పరిశోధనా సంస్థ) మరియు వ్యవసాయ విస్తరణ శాఖ కలిసి తీర ప్రాంతపు రైతులను శాస్త్రీయ పరిజ్ఞానంతో అనుసంధానం చెయ్యడానికి ....

**4**





**జీవగతిశీల సేద్య పాఠశాల.............................. డి. తంగపాండియన్**

వ్యవసాయం లాభసాటిగా అనిపించకపోవడంతో, అనేకమంది యువత వ్యవసాయేతర జీవనోపాధి మార్గాలను వెతుక్కుంటున్నారు. ఈ సమస్యకు పరిష్కారంగా, వ్యవసాయాన్ని సుస్థిరంగా మరియు లాభసాటిగా చేసేందుకు రెండు సంవత్సరాల శిక్షణా కార్యక్రమాన్ని స్కూల్ ఆఫ్ బయోడైనమిక్ ఫార్మింగ్ నిర్వహిస్తోంది.

**6**





**సుస్థిర చెరకు చొరవ ...........బిక్షం గుజ్జ మరియు యు.ఎస్. నటరాజన్**

సస్టైనబుల్ షుగర్ కేన్ ఇనిషియేటివ్ (సుస్థిర చెరకు చొరవ), ఎస్.ఎస్.ఐ. అన్నది ఒక వినూత్నమైన వ్యవసాయ అచరణ పద్ధతుల సముదాయం. జీవావరణ ఫుట్ ప్రింట్ (పర్యావరణంపై ఒక పద్ధతి చూపించే ప్రతికూల ప్రభావం) ను తగ్గించే ఈ పద్ధతి ...

**9**





**మెరుగైన ఆదాయం కోసం మార్కెట్ల అనుసంధానం .......శ్రీనాథ్ దీక్షిత్...**

రైతులకు మెరుగైన ఆదాయం లభించేలా చెయ్యాలంటే, మార్కెట్ లంకెలను ఏర్పరచడం అత్యంత కీలకం. మార్కెట్ లంకెలు ఏర్పరచాలంటే, డిమాండు మరియు సరఫరా పరిస్థితిని, తాత్కాలికంగా నిలువచేసే వసతులను, రవాణా ...

**12**





**మార్పును తట్టుకోవడం : ఒక గొర్రెల కాపరి...... నిత్య సాంబమూర్తి ఘొట్గె**

ఇంటర్నెట్, సెల్ ఫోన్లతో నిండివున్న నేటి సమాచార యుగంలో, ఆందోళన కలిగించే వేగంతో మారుతున్న పరిస్థితులను, సవాళ్ళను ఎదుర్కోడానికి ఒక్క పారంపరిక విజ్ఞానమే సరిపోదు. ఈ మార్పులను తట్టుకొని నిలబడలేక చతికిలబడ్డ వాటిల్లో ...

**16**

# ప్లాంట్ హెల్త్ క్లినిక్స్ ః రైతులను శాస్త్రీయ పరిజ్ఞానంతో అనుసంధానించడం

టిథే ఫర్హానా



మొబైల్ ఫోనులో శాస్త్రవేత్తను సంప్రదిస్తున్న రైతు

**ప్లాంట్ హెల్త్ క్లినిక్స్ (వృక్ష వైద్యశాలలు) అన్నది బంగ్లాదేశ్ రైస్ రిసర్చ్ ఇన్స్టిట్యూట్ (బంగ్లాదేశ్ వరి పరిశోధనా సంస్థ) మరియు వ్యవసాయ విస్తరణ శాఖ కలిసి తీర ప్రాంతపు రైతులను శాస్త్రీయ పరిజ్ఞానంతో అనుసంధానం చెయ్యడానికి మొదలుపెట్టిన ఒక విన్నూత్నమైన కార్యక్రమం. ఈ కార్యక్రమం రైతులకు ప్రయోజనకరంగా ఉండడంతో, ఈ వృక్ష వైద్యశాలలు అందించే సేవలకు ఆదరణ అంతకంతకూ పెరుగుతోంది.**

బంగ్లాదేశ్ నైరుతి తీర ప్రాంతంలోని వ్యవసాయ-జీవావరణం ఎంతో సున్నితమైనది. వాతావరణ మార్పులకు ఎక్కువగా గురౌతూ ఉంటుంది. ఇక్కడ భూమిలో ఉప్పదనం పెరగడం వలన, గత పదేళ్ళలో ఆ ప్రాంతంలోని సత్ఖిర జిల్లాలో ఎంతోమంది రైతులు వారి భూములను, పంటలను వదులుకోవలసివచ్చింది.

2007 సంవత్సరంలో అపసవ్యమైన వాతావరణ పరిస్థితులు - ఎక్కువ కాలం చలి మంచు ఉండడం, చీడపీడలు అధికంగా ఉండడం వలన వరి పంట తీవ్రంగా దెబ్బతింది. కాబట్టి, సత్ఖిర ప్రాంతపు రైతులకు వాతావరణ మార్పు (క్లైమాటికి చేంజ్) అన్నది ఏదో భవిష్యత్తులో సంభవించగల ముప్పు కాదు. ఇప్పటి వారి జీవనోపాధినే దెబ్బతీస్తున్న వాస్తవం.

ఆ సంవత్సరం, అంటే, 2007లో సుశీలన్ అన్న ఒక ప్రభుత్వేతర సంస్థ ఈ ప్లాంట్ క్లినిక్ ప్రాజక్టును మొదలుపెట్టింది. లవణ గుణాన్ని తట్టుకునే వరి రకాలను వాడడం వంటి వాతావరణ మార్పులను తట్టుకోగల వ్యవసాయ ఆచరణ పద్ధతులు అంతకు ముందు కొన్ని అమలుచేసినప్పటికీ, జిల్లా వ్యాప్తంగా ఉన్న రైతులందరినీ చేరుకోవడానికి ఒక పూర్తి స్థాయి వ్యవసాయ విస్తరణా కార్యక్రమం అవసరమైంది.

రైతులతో చర్చిస్తున్న వృక్ష వైద్యురాలు



సామాన్యంగా సంభవించే వ్యవసాయ సమస్యలకు గల మూల కారణాలను గుర్తించి, వాటిని వర్గీకరించడం, లావణీయతను తట్టుకునే రకాలను ఎంచుకోవడం వంటి పరిష్కార మార్గాలను చూపించడం మరియు సరైన ఆచరణ పద్ధతులను అవలంభించడం ద్వారా వ్యవసాయ ఉత్పాదకతను పెంచడం అన్నవి ఈ కార్యక్రమం యొక్క ప్రధాన లక్ష్యాలు.

## ప్లాంట్ హెల్త్ క్లినిక్ ( వృక్ష వైద్యశాల)

బంగ్లాదేశ్ రైస్ రిసర్చ్ ఇన్స్టిట్యూట్ మరియు వ్యవసాయ విస్తరణ శాఖవారి తోడ్పాటుతో సుశీలన్ సంస్థ ప్లాంట్ హెల్త్ క్లినిక్ (వృక్ష వైద్యశాల) లను మొదలుపెట్టింది. ఈ క్లినిక్ లలో కంప్యూటర్లు, వెబ్‌కేమ్‌లు, డిజిటల్ కెమేరాలు మరియు డిజిటల్ మైక్రోస్కోపులు సమకూర్చబడి ఉంటాయి. సుశీలన్ సంస్థలోని ఇద్దరు వృక్ష వైద్యులు, వ్యవసాయ సమస్యల గురించి తెలుసుకోవడంలో, ఫలానా సమస్య అని నిర్ధారించడంలో, ఆ సమస్యలకు నివారణ మార్గాలు తెలుపడంలో సాధ్యమైనంత మేరకు తీరప్రాంత రైతులకు తోడ్పాటునందిస్తారు. అవసరం అనుకున్న సందర్భాలలో సంబంధిత శాస్త్రవేత్తలను కూడా సంప్రదిస్తారు.

> 2007-2011 మధ్య కాలంలో పంట ఉత్పాదకత, పంట వివిధీకరణ మరియు పంట తీవ్రత పెరిగాయి. పాక్షికంగా, ఈ పెరుగుదలకు కారణం ప్లాంట్ క్లినిక్స్



ఇంటర్నెట్ ద్వారా శాస్త్రవేత్తను సంప్రదిస్తున్న వృక్ష వైద్యుడు

ఇటువంటివి, రెండు ప్లాంట్ క్లినిక్‌లను ఏర్పాటు చెయ్యడానికైన ఖర్చు దాదాపు రూ. 3,75,000/-. ఇదికాక, మళ్ళీ మళ్ళీ అయ్యే ఖర్చు, అంటే వృక్ష వైద్యుల జీతాలు, భవనపు అద్దె, రవాణా మరియు ఇంధనపు ఖర్చులు, ఇంటర్నెట్ బిల్లు వంటి ఖర్చులు, కలిసి దాదాపు నెలకి రూ. 93,800/- అవుతాయి. ఈ కార్యక్రమం రూపొందిస్తున్న సమయంలో ఈ సేవను మొబైల్ లేదా ఇంటర్నెట్ ద్వారా అందించినందుకుగాను రైతుల దగ్గర కొంత రుసుము, సుమారు రూ. 6 /- చొప్పున వసూలు చేయాలని అనుకున్నా, ప్రజలలో ఐ.సి.టి.(ఇన్ఫర్మేషన్ అండ్ కమ్యూనికేషన్ టెక్నాలజీలు) పట్ల అంతగా అవగాహన లేనందువలన, ఏ విధంగా అయినా ప్లాంట్ క్లినిక్ సేవల యొక్క ప్రయోజనాన్ని ప్రజలకు చూపించాల్సిన అవసరం ఉన్నందువలన, ముందుగా ఈ సేవను ఉచితంగానే అందించడానికి నిర్ణయమైంది.

## వినియోగం మరియు ప్రభావం

రైతులతో జరిపిన చర్చల బట్టి చూస్తే రైతులకు ఈ సేవ ఉపయోగకరంగా ఉన్నట్టే తెలిసింది. ఐ.సి.టి వ్యవస్థ ద్వారా వారికి అందిన సమాచారం - ఏ ఏ పంటలు వేసుకోవాలి? (మొక్క జొన్నా లేక పొద్దు తిరుగుడా అని), లేదా ఉప్పదనాన్ని తట్టుకునే పంటలను వేసుకోవాలా? వేసుకున్న పంటలలో ఎటువంటి పరీక్షలు జరిపించుకోవాలి? అన్నటువంటి అంశాలలో వారికి అందిన సలహాలు, సూచనలు ఉపయుక్తంగా ఉన్నట్లు రైతులు తెలిపారు. అంతేకాక, వారు చేపట్టవలసిన చర్యలు - ఎరువు, పురుగులమందులు వేసుకోవడం పైన స్పష్టమైన సలహాలు, అంటే ఏ ఎరువు లేదా మందు ఎంచుకోవాలి, ఎంత మోతాదులో, ఎప్పుడెప్పుడు, ఎలా వాడాలి అన్నవాటి గురించి కూడా ఐ.సి.టి. వ్యవస్థ తమకు మంచి సలహాలు, సూచనలు అందజేసినట్లు రైతులు తెలిపారు.

ఈ ప్రాజెక్ట్ వలన కలిగిన ప్రయోజనాన్ని వృక్ష వైద్యులు కూడా గుర్తించారు. ఉదాహరణకి, వీరిలో ఒకరు వంగ పంట మీద అంతకు ముందు ఎప్పుడూ రాని ఒక కొత్త తెగులును గుర్తించవలసి వచ్చినప్పుడు ఆ తెగులు తాలూకు డిజిటల్ చిత్రాలు గ్లోబల్ ప్లాంట్ క్లినిక్ (జి.పి.సి) అనే అంతర్జాతీయ సంస్థకు పంపడం జరిగింది. స్థానికంగా తుల్షిపారా అని పిలువబడే ఈ తెగులు ఆ ప్రాంతంలో నెలకొని ఉన్న అధిక ఉష్ణోగ్రతా పరిస్థితుల కారణంగా వచ్చినట్లు జి.పి.సి వారు గుర్తించారు.

2001-12 సంవత్సరంలో, చీడపీడల నివారణకు ఐ.సి.టి. వ్యవస్థ సిఫార్సులు ఉపయోగకరంగా ఉన్నట్లు కాళిగొంజ్ ఉపజిల్లా స్థానిక వ్యవసాయ విస్తరణ శాఖవారు తెలియచేశారు. 2007 మరియు 2011 మధ్య కాలంలో ఈ చీడపీడల వలన సంభవించే పంట నష్టాన్ని కనీసం 20% మేరకైనా తగ్గించడం సాధ్యపడిందని వీరి అంచనా. అదే సమయంలో పంట ఉత్పాదకత కూడా పెరిగింది. దాదాపు 80శాతం సందర్భాలలో 'ఈల్డ్ గాప్', అంటే ఒక హెక్టారుకు రాగల ఉత్పత్తికీ, వాస్తవంగా వస్తున్న ఉత్పత్తికీ మధ్య ఉన్న వ్యత్యాసం తగ్గింది. వేసిన పంటలలో కూడా వైవిధ్యం పెరిగింది. లావణీయతను తట్టుకునే వరి రకాలతో పాటూ మొక్క జొన్న, పొద్దుతిరుగుడు పంటలు కూడా వేసుకోవడం జరిగింది. అంతేకాక 'క్రాప్ ఇంటెన్సిఫికేషన్' అంటే ఒక సంవత్సరంలో నాటిన పంటల సంఖ్య 1 నుండి 1.28 కి పెరిగింది.

ప్లాంట్ క్లినిక్‌లు అందించిన సిఫార్సులు, సూచనలు చాలా బావున్నాయని రైతులు అన్నారు. ప్లాంట్ క్లినిక్ వారు వేగంగా అందించిన నాణ్యమైన సమాచారాన్ని రైతులు మెచ్చుకున్నారు. ముఖ్యంగా చీడలు మరియు తెగుళ్ళకు సంబంధించిన సమాచారం, కొత్త పంటరకాల వివరాలు, ఎరువులు, పురుగు మందుల మోతాదు, ముందస్తు హెచ్చరికల వంటి సమాచారం వారికి ఎంతగానో ఉపకరించింది.

ప్లాంట్ క్లినిక్ యొక్క సేవలకు ఖచ్చితంగా డిమాండ్ పెరుగుతూ వస్తోంది. ఈ సేవలు అందుకోవడం ద్వారా రైతులు లాభాలను సాధించుకుని, వీటి యొక్క ప్రయోజనాన్ని కనుక గుర్తించినట్లైతే, రాబోయే కాలంలో ఈ ప్లాంట్ క్లినిక్‌ల యొక్క సేవలను అందుకోవడానికి రైతులు కొంత రుసుము చెల్లించడానికి కూడా ఇష్టపడవచ్చు. ◆

**Tithe Farhana**
E-mail : tithefarhana@gmail.com

ఆంగ్లమూలం :

లీసా ఇండియా సంపుటి 15, సంచిక 3 సెప్టెంబర్ 2013



ఆచరణ పాఠశాల

# జీవగతిశీల సేద్య పాఠశాల

## (బయోడైనమిక్ ఫార్మింగ్ స్కూల్): యువతను వ్యవసాయరంగంలో నిలుపుకోవడం

డి. తంగపాండియన్

**వ్యవసాయం లాభసాటిగా అనిపించకపోవడంతో, అనేకమంది యువత వ్యవసాయేతర జీవనోపాధి మార్గాలను వెతుక్కుంటున్నారు. ఈ సమస్యకు పరిష్కారంగా, వ్యవసాయాన్ని సుస్థిరంగా మరియు లాభసాటిగా చేసేందుకు రెండు సంవత్సరాల శిక్షణా కార్యక్రమాన్ని స్కూల్ ఆఫ్ బయోడైనమిక్ ఫార్మింగ్ నిర్వహిస్తోంది.**

భారత దేశపు వ్యవసాయం అనాదిగా ఎంతో సంక్షోభానికి లోనౌతూ ఉంది. ఈ సమస్యలలో కొన్ని మనుషులు కల్పించుకున్నవే. వీటికి తోడు సరైన సాంకేతిక పద్ధతులు, ఆచరణ పద్ధతులు పాటించకపోవడం వలన వ్యవసాయం లాభసాటిగా ఉండడంలేదు. గ్రామీణ ప్రజల జీవన ప్రమాణాలు అంతకంతకూ తగ్గిపోతున్నందువలన, వీరిలో చాలామంది పట్టణ ప్రాంతాలకు వలసపోవడం మొదలుపెట్టారు. తాజా జనాభా లెక్కల ప్రకారం, తమిళ్‌నాడు రాష్ట్రంలో ఈ ధోరణి అత్యధికంగా ఉన్నట్లు, మొత్తం జనాభాలో దాదాపు 50% పట్టణాలలోనే నివసిస్తున్నట్లు తెలిసింది. అసలు మనం ఎటు ప్రయాణిస్తున్నట్టు? ఐ.టి. కంపెనీలను, వస్తువులు తయారు చేసే పరిశ్రమలను కోవిల్పట్టి, ఉసిలంపట్టి లాంటి ఊర్లకు మార్చుకుంటామా? మరి అప్పుడు రాష్ట్రానికి సరిపడా ఆహారం ఎవరు పండిస్తారు? ఆందోళన కలిగించే ఈ ప్రశ్నలకు మనం జవాబులు వెతకవలసి ఉంది.

ఒక సవాలుగా, వ్యవసాయాన్ని వారి వృత్తిగా స్వీకరించగలిగిన ఉత్సాహవంతమైన, శిక్షణ పొందిన గ్రామీణ యువత యొక్క అవసరం మనకు ఈరోజు ఎంతైనా ఉంది. అయితే, మనం వారికి కేవలం వ్యవసాయాన్ని సుస్థిరం చేసుకోవడమేకాక, వ్యవసాయాన్ని ఆర్థికపరంగా కూడా ఒక లాభసాటి వ్యవహారంగా చెయ్యడం కోసం,




పాఠశాల ఆవరణ



నీటి సంరక్షణ కట్టడాల నిర్మాణాన్ని నేర్చుకుంటున్న విద్యార్థులు

వారికి ఆధునిక టెక్నాలజీలలో కూడా శిక్షణ ఇవ్వవలసి ఉంటుంది. ఈ ప్రయత్నంలో భాగంగా, తమిళనాడులోని కరూర్ జిల్లలో, గాంధేయవాద సూత్రాల ఆధారంగా నడుపబడుతున్న ''ఇన్‌బా సేవా సంగం'' అన్న సంస్థకు చెందిన మేము రాబోయే సంవత్సరాలలో సుశిక్షితులైన వ్యవసాయదారులుగా తయారు కావడానికి నిరుపేద గ్రామీణ యువతకు జీవగతిశీల వ్యవసాయాన్ని (బయోడైనమిక్ ఫార్మింగ్) నేర్పించేందుకు ఒక పాఠశాలను మొదలుపెట్టాము. ఈ విద్యార్థులు కేవలం సేంద్రియ లేదా జీవగతిశీల వ్యవసాయాన్ని వారి జీవనోపాధి మార్గంగా ఎంచుకోవడమే కాక 'హీలింగ్ ది ఎర్త్ కాంపెయిన్' (భూమిని స్వస్థత పరిచే ఉద్యమం) జట్టులో కూడా భాగస్వాములౌతారు.

ఈ స్కూల్ ఆఫ్ బయోడైనమిక్ ఫార్మింగ్ పాఠశాల తమిళ నాడులోని కరూర్ జిల్లాకు చెందిన వినోబాజీపురంలో 2012 జులై 11న మొదలైంది. రెండు సంవత్సరాల రెసిడెన్షియల్ (అక్కడ ఉండి చదువవలసిన) డిప్లొమా ప్రోగ్రాం, ''ఇన్‌బా సేవా సంగం'' తోడ్పాటుతో ఉచితంగా అందించడం జరుగుతోంది. మొదటి బ్యాచ్‌లో 7మంది విద్యార్థులు ఉన్నారు. బి.డి.7గా పిలువబడుతున్న వీరంతా ఆ చుట్టుపక్కల గ్రామాలలోని నిరుపేద వ్యవసాయ కుటుంబాలకు చెందినవారు. జూన్, 2014 నాటికి వీరి శిక్షణా కాలం పూర్తయ్యింది.

బయోడైనమిక్ వ్యవసాయంలోని అన్ని అంశాలలోనూ విద్యార్థులకు లెర్నింగ్ బై డూయింగ్ (చేయడం ద్వారా నేర్చుకోవడం) అన్న పద్ధతిలో శిక్షణ అందించబడుతుంది. కేవలం సిద్ధాంతాల మీద కాకుండా ఆచరణ పాఠాల పైన ఎక్కువగా దృష్టి పెట్టడం జరుగుతుంది. పాఠ్య ప్రణాళిక మూడు భాగాలుగా విభజించబడి ఉంటుంది - సాంకేతిక నైపుణ్యాల శిక్షణ, భావ వికాస నైపుణ్యాల శిక్షణ(సాఫ్ట్ స్కిల్స్ ట్రైనింగ్) మరియు ఆచరణ శిక్షణ.

> యువతను వ్యవసాయ పద్ధతులలో సుశిక్షితులలుగా చెయ్యడమే కాక వారిని బాధ్యతాయుతమైన, అంకితభావం కల గ్రామీణ పౌరులుగా తీర్చి దిద్దడం కూడా ఈ కార్యక్రమం యొక్క ముఖ్యోద్దేశ్యం.

సాంకేతిక నైపుణ్యాల శిక్షణ కింద, విద్యార్థులు అగ్రోఫారెస్ట్రీ (వ్యవసాయక అటవీకరణ), వాటర్ షెడ్ నిర్వహణ, నీటిపారుదల నిర్వహణ, పొలంలోని పనిముట్ల నిర్వహణ, బయోడైనమిక్ (జీవగతిశీల) వ్యవసాయం, భూసారానికి సంబంధించిన అంశాలు, వ్యవసాయ శాస్త్రం, ఉద్యానవన శాస్త్రం, విత్తన సాంకేతిక శాస్త్రం, ధ్రువీకరణ (సర్టిఫికేషన్) మరియు మార్కెటింగ్ గురించి నేర్చుకుంటారు. సాఫ్ట్‌స్కిల్స్ ట్రైనింగ్‌లో భాగంగా విద్యార్థులు కమ్యూనికేషన్ స్కిల్స్ (భావప్రసార నైపుణ్యాలు), లైఫ్ కోపింగ్ స్కిల్స్ (జీవితంలో ఎదురయ్యే ఒడిదుడుకులని తట్టుకునే నైపుణ్యాలు), బేసిక్ కంప్యూటర్ అప్లికేషన్ (కంప్యూటర్ వినియోగం లో ప్రాథమిక సామర్థ్యం), కళలు మరియు సంస్కృతి గురించిన విషయాలు తెలుసుకుంటారు.

బోధనా కాలం 3 మాసాలు గల 6 టర్మ్‌లుగా విభజింపబడింది. ప్రతి టర్మ్ (బోధనా కాలం) చివర విద్యార్థులు ప్రసిద్ధి చెందిన సేంద్రీయ లేదా బయోడైనమిక్ క్షేత్రాలలో, 3-4 వారాల పాటు ఆచరణ పూర్వక శిక్షణను అందుకుంటారు. ఆచరణ ప్రధాన అంశంగా ఉన్న ఈ బోధనా కాలంలో విద్యార్థులు బయోడైనమిక్ మిశ్రమాల తయారీ మరియు వాడకం, బయోడైనమిక్ కంపోస్టు మరియు లిక్విడ్ మెన్యూర్ (ద్రవరూపంలోని ఎరువు) యొక్క తయారీ మరియు ఉపయోగించే విధానంవంటి అన్ని బయోడైనమిక్ వ్యవసాయ పద్దతులనూ నేర్చుకుంటారు. టిల్లర్లు (దుక్కిదున్నే పరికరాలు), వీడర్లు (కలుపు తీసే పరికరాలు), స్ప్రేయర్లు (పురుగు మందుచల్లే పరికరాలు), మరియు ష్రెడ్డర్లు

(ఆకులు, కొమ్మలు వంటి వాటిని ముక్కలుగా చేసే యంత్రాలు) మొదలైన వ్యవసాయ పరికరాల యొక్క వినియోగం మరియు నిర్వహణలో కూడా విద్యార్థులు శిక్షణ పొందుతారు. విద్యార్థులు ఆరోవిల్‌లోని విందర ఫార్మ్స్, కొడైకెనాల్‌లోని కురింజి బయోడైనమిక్ ఫార్మ్ మరియు వాల్డార్ఫ్స్ స్కూల్ వంటి సేంద్రియ మరియు బయోడైనమిక్ క్షేత్రాలను సందర్శించారు. ఎం.సి.ఆర్.సి. చెన్నై వారు నిర్వహించే 'ఆల్టర్నేట్ అనలెటికల్ టెస్టింగ్ ఆఫ్ మైక్రో న్యూట్రియంట్స్ ఫర్ సాయిల్ ఎనాలిసిస్' (ప్రత్యామ్నాయ విశ్లేషణా పద్ధతులలో భూమిలోని సూక్ష్మపోషకాల పరీక్ష) అన్న శిక్షణా కార్యక్రమాన్ని కూడా ఈ విద్యార్థులు అందుకున్నారు. బయోడైనమిక్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా సంస్థ వారు షెన్ బగనుర్‌లో నిర్వహించిన బయోడైనమిక్ శిక్షణా కార్యక్రమాలలో కూడా ఈ విద్యార్థులు పాల్గొన్నారు.

రెండవ సంవత్సరంలో, ఈ విద్యార్థులకు ధ్రువీకరణ (సర్టిఫికేషన్) మరియు మార్కెటింగ్ గురించి కొంత ప్రాథమిక అవగాహన కల్పించడం జరుగుతుంది. భవిష్యత్తులో వారు వారి సొంత క్షేత్రాలను నిర్వహించుకునే సందర్భంలో వారికి ఈ అవగాహన ఎంతో ఉపయోగపడగలదు. 'హీలింగ్ ది ఎర్త్ కాంపెయిన్' అన్న భూమిని స్వస్థత పరిచే మా ఉద్యమంలో ప్రచారకులుగా, బోధకులుగా వ్యవహరించడానికి రాబోయే పది సంవత్సరాలలో, యువకులూ, యువతులూ, కూడా కలిపి, దాదాపు 1000 మంది యువతను తీర్చిదిద్దాలన్నది మా ఆశయం. కేవలం వ్యవసాయ సాంకేతిక పద్ధతులను నేర్పించడమే కాకుండా, వీరంతా ఒక క్రమబద్ధమైన, అంకితభావంతో కూడుకున్న ఆదర్శప్రాయమైన జీవితాన్ని గడిపేందుకు కూడా దోహదపడడమే ఈ కార్యక్రమం యొక్క ఉద్దేశ్యం. ఇటువంటి సమిష్టి చొరవలు సమాజంలో మంచి మార్పును తీసుకు రాగలవని మేము దృఢంగా నమ్ముతాము. ◆

డి. తంగపాండియన్, 'స్కూల్ ఆఫ్ బయోడైనమిక్ ఫార్మింగ్' సంస్థ వారి ఎకడమిక్ కమిటి (విద్యా సంబంధ సమితి) లో సభ్యులు మరియు ఫార్మ్ ఇండియా (www.farmindia.org) సంస్థలో ప్రధాన కార్యకర్త.

**Mr. Jayakaran, Director,**
The School of Biodynamic Farming,
Vinobajipuram, Karur District, Tamil Nadu.
http://www.inbasevasangam.org

ఆంగ్లమూలం :

లీసా ఇండియా సంపుటి 15, సంచిక 3 సెప్టెంబర్ 2013

# సుస్థిర చెరకు చొరవ – దిగుబడుల పెంపు, జీవావరణ ఫుట్ ప్రింట్ తగ్గింపు

బిక్షం గుజ్జ మరియు యు.ఎస్. నటరాజన్

**సస్టైనబుల్ సుగర్ కేన్ ఇనిషియేటివ్ (సుస్థిర చెరకు చొరవ), ఎస్.ఎస్.ఐ. అన్నది ఒక వినూత్నమైన వ్యవసాయ అచరణ పద్ధతుల సముదాయం. జీవావరణ ఫుట్ ప్రింట్ (పర్యావరణంపై ఒక పద్ధతి చూపించే ప్రతికూల ప్రభావం) ను తగ్గించే ఈ పద్ధతి భారత దేశపు చెరకు రైతులలో ఎంతో వేగంగా ప్రాచుర్యం పొందుతోంది. దిగుబడులు అధికంగా ఉండి, నీటి వినియోగం మరియు ఇతర ఉత్పాదకాల వినియోగం తక్కువగా ఉన్న కారణంగా త్వరలోనే ఎస్. ఎస్.ఐ చెరకు నాటడానికి ప్రామాణికమైన పద్ధతిగా మారే అవకాశం ఉంది. వివిధ రంగాల యొక్క సమన్వయ కృషి ఈ ఎస్.ఎస్.ఐ. పద్ధతి యొక్క విస్తరణకు తోడ్పడగలదు.**

భారతదేశంలో, వ్యవసాయ-పారిశ్రామిక పంటలలో పత్తి తరువాత స్థానం చెరకుదే. దాదాపు 350 మిలియన్ టన్నుల ఉత్పత్తితో, ప్రపంచవ్యాప్తంగా, చెరకు ఉత్పత్తిలో,బ్రెజిల్ తరువాత రెండవ స్థానం మన దేశానిదే. మన దేశ ఆర్థిక వ్యవస్థకి రూ. 90.000 కోట్ల రూపాయల మేరకు తోడ్పడుతూ, చెరకు పంట దాదాపు 5 మిలియన్ హెక్టార్ల విస్తీర్ణంలో పండించడం జరుగుతోంది. ఇటీవల, విద్యుత్తు మరియు ఎథనాల్ ఉత్పత్తి కొరకు కూడా చెరకు సాగు చేపడుతున్నారు. ఈ ఆర్థిక, సామాజిక ప్రయోజనాల దృష్ట్యా చెరకును భారత దేశపు భవిష్య పంటగా పేర్కొనవచ్చు.



తన ఎస్.ఎస్.ఐ. చెరకు తోటలో సంతోషంగా ఉన్నరైతు

అయితే ప్రస్తుతం చెరకు పంట సాగు సంక్షోభంలో ఉంది. దిగుబడులు తక్కువై, సాగుబడిలో ఉన్న రకాలు పతనం చెంది, ఉత్పాదకాల ధరలు పెరిగిపోయి, చీడ పీడలు ఎక్కువై, భూమి క్షీణించి, లవణత పెరిగి, నీటి ముంపు మరియు కరువు పరిస్థితులు ఏర్పడడంతో చెరకుసాగు విస్తీర్ణం క్రమంగా తగ్గిపోతోంది. ముఖ్యంగా నీటి లభ్యత కూడా చెరకు సాగుకు ఒక పెద్ద ప్రతిబంధకం. చెరకు పంటకు 1500-3000 మి.మీ. వరకూ నీరు అవసరమౌతుంది. ప్రధాన పంటలన్నింటిలోకీ, చెరకు పంటకు అవసరమయ్యే నీరు చాలా ఎక్కువ. ప్రతి ఒక్కకిలో చెక్కర ఉత్పత్తికి, దాదాపు 2000లీటర్ల నీరు అవసరమౌతున్నట్లు ఉత్తరప్రదేశ్‌లో జరిపిన ఒక అధ్యయనంలో తేలింది. దీన్నిబట్టి చెరకు పంటలో నీటి వినియోగం ఎంత ఎక్కువ ఉందో తెలుస్తోంది. అదే ఎస్.ఎస్.ఐ. పద్ధతి కనుక చేపడితే చెరకు పంటలో నీటి వినియోగాన్ని గణనీయంగా తగ్గించవచ్చు.

## చెరకు నారుమడి – ఎస్.ఎస్.ఐ. యొక్క నవకల్పన

సాంప్రదాయ పద్ధతికి భిన్నంగా, ఈ పద్ధతిలో చెరకు ముచ్చెలు కాక, ఒక నెల వయసున్న నారు నాటుతారు. చెరకు గడ నుండి కణుపుల దగ్గరున్న అంకురాన్ని (బడ్స్) విడదీసి, వాటిని మొలిపించడం వలన ఎస్.ఎస్.ఐ.ని 'బడ్ చిప్ టెక్నాలజీ' అని వ్యవహరిస్తారు. దాదాపు 60 సంవత్సరాల ముందునుండి ఈ ఆచరణ పద్ధతి కొంతమంది రైతులకు తెలిసిఉన్నప్పటికీ, ఒక క్రమ పద్ధతిలో ఈ విధానాన్ని ప్రొత్సహించడం జరుగలేదు. ఎస్.ఎస్.ఐ. పద్ధతిలో పంటను ఎలా నిర్వహించుకోవాలో అన్నది అంచెలంచలుగా వివరించే ఒక మాన్యువల్ రూపంలో ప్రచురించబడింది.



చెరకు నారుమడి

## సస్టైనబుల్ సుగర్ కేన్ ఇనిషియేటివ్

పైన పేర్కొన్న సమస్యలలో చాలావాటికి ప్రస్తుతం మన వద్ద ఉన్న మొట్టమొదటి పరిష్కారం సస్టైనబుల్ సుగర్‌కేన్ ఇనిషియేటివ్ (ఎస్.ఎస్.ఐ.) అనబడే సుస్థిర చెరకు సాగు పద్ధతి. సస్టైనబుల్ సుగర్ కేన్ ఇనిషియేటివ్ (ఎస్.ఎస్.ఐ.) అన్నది విత్తన మోతాదును తగ్గించడం, నారును నర్సరీలలో పెంచడం, నూతన నాట్ల పద్ధతులను అవలంభించడం, మొక్కల మధ్య దూరాన్ని పెంచడం, చెరకు ఉత్పత్తి పెరిగే విధంగా మేలైన నీటి నిర్వహణ మరియు పోషకాల యాజమాన్యం చేపట్టడం వంటి కొన్ని వినూత్న వ్యవసాయ ఆచరణ పద్ధతుల సముదాయం.

ఎస్.ఎస్.ఐ. పద్ధతిలో ఇమిడిఉన్న సూత్రాలు: ఒక కణుపు ఉన్న ముచ్చెలతో నర్సరీని పెంచడం, 25-30 రోజుల వయసున్న లేత నారును నాటడం, ప్రధాన పొలంలో నారును దూరం దూరంగా, అంటే 4-6 x 2 అడుగుల దూరంలో నాటుకోవడం, మొక్కలకు తగినంత తేమ అందేలా చూసుకోవడం, పొలంలో నీరు నిలిచిపోకుండా జాగ్రత్త పడడం, సేంద్రియ ఎరువుల వాడకాన్ని ప్రోత్సహించడం, మేలైన పంట యాజమాన్య పద్ధతులు, సస్యరక్షణ పద్ధతులు, మరియు భూమిని సమర్థవంతంగా వినియోగించడానికి అంతరపంటలు వేసుకోవడం. ఇటువంటి ఆచరణ పద్ధతులు గతంలో అక్కడక్కడ వాడుకలో ఉన్నప్పటికి, వాటిన్నింటినీ కలిపి వినియోగంలోకి తెచ్చే ప్రయత్నం మాత్రం మొట్ట మొదట 2009లో డబ్ల్యు.డబ్ల్యు.ఎఫ్. - ఇక్రిసాట్ వారి ప్రాజెక్ట్ ద్వారా జరిగింది.

> ఎస్.ఎస్.ఐ. పద్ధతిలో విత్తన చెరకును వృద్ధి చెసే తరబడి గణనీయంగా పెరుగుతుంది, 1:60 నుండి 1:80 వరకూ. అదే సాంప్రదాయ పద్ధతిలో ఈ తరబడి 1:6 నుండి 1:8 మాత్రమే ఉంటుంది. అందువలన, చెరకు రకాలను అత్యంత వేగవంతంగా విస్తరించడం సాధ్యపడుతుంది.

## సత్ఫలితాలు

ఎస్.ఎస్.ఐ. పద్ధతిలో పండించిన చెరకు యొక్క వేరు వ్యవస్థ దృఢంగా తయారై, పిలకలు ఎక్కువగా వేసి, గడలు పొడుగ్గా, లావుగా ఏర్పడ్డాయి. ఇవన్నీ కలిసి కేవలం చెరకు దిగుబడి పెరగడానికి కారణం అవ్వడమే కాకుండా ఎక్కువ చక్కర ఉత్పత్తికి కూడా ఎంతగానో దోహదపడ్డాయి. పెరుగుదల వేగంగా ఉండడం వలన, మొక్క ఆకులు మరీ దట్టంగా లేకుండా ఉండడం వలన, చీడపీడల బెడద కూడ తక్కువగా ఉంది. ఇంకా ఇతర ప్రయోజనాలు: హెక్టారుకు 4 టన్నుల వరకు విత్తన చెరకు ఆదా, నారుమడి పెంపకం పద్ధతి అవలంభించడం వలన మొదటి నెలలో ఇంచుమించు 90% వరకూ నీరు ఆదా, దూర దూరంగా నాటుకోవడం వలన, నీటిని సమర్థవంతంగా వినియోగించుకునే సూక్ష్మనీటి పారుదల వ్యవస్థలను వినియోగించుకోవడం కారణం గా ప్రధాన పొలంలో దాదాపు 30% నీరు ఆదా, అంతేకాక ఎస్.ఎస్.ఐ. పద్ధతిలో కార్శిపంట చాలా బాగా వస్తుంది.

కొత్త రకాలను ఎంచుకుని పండించడం అన్నది చెరకు పంట సాగులో ఒక ముఖ్యమైన సమస్య. ఎస్.ఎస్.ఐ. పద్ధతిలో విత్తన చెరకును వృద్ధిచేసే తరబడి గణనీయంగా పెరుగుతుంది, 1:60 నుండి 1:80 వరకూ. అదే సాంప్రదాయ పద్ధతిలో ఈ తరబడి 1:6 నుండి 1:8 మాత్రమే ఉంటుంది. అందువలన, చెరకు రకాలను అత్యంత వేగవంతంగా విస్తరించడం సాధ్యపడుతుంది.

## విస్తరణ

మొట్టమొదటిసారి ఈ ఎస్.ఎస్.ఐ.పద్ధతిని, డబ్ల్యు.డబ్ల్యు.ఎఫ్.- ఇక్రిసాట్ ప్రాజక్టు, ఆంధ్రప్రదేశ్ మరియు ఉత్తరప్రదేశ్ రాష్ట్రాలలో ప్రయోగాత్మకంగా మొదలుపెట్టింది. ఈ కార్యక్రమం 2009-10 సంవత్సరంలో ఒక్కోరాష్ట్రంలో 10 హెక్టార్ల విస్తీర్ణంలో ఎస్.ఎస్.ఐ. పద్ధతిని విజయవంతంగా ప్రదర్శించి చూపించింది. అదే సంవత్సరం, రెండు ప్రభుత్వేతర సంస్థల తోడ్పాటుతో చెరకు ఎక్కువగా పండించే తీరప్రాంతమైన ఒరిస్సా రాష్ట్రంలో 13 హెక్టార్ల విస్తీర్ణంలో మరియు పంజాబ్ రాష్ట్రంలోని 4 హెక్టార్ల విస్తీర్ణం లో కూడా ఎస్.ఎస్.ఐ. పద్ధతి ప్రదర్శింపబడింది. ఈ మూడు ప్రాంతాలలో ఎస్.ఎస్.ఐ. అనూహ్యమైన విధంగా సత్ఫలితాలు సాధించిన తరువాత, డబ్ల్యు. డబ్ల్యు.ఎఫ్. - ఇక్రిసాట్ ప్రాజక్టు ముగింపుకు రావడంతో, భారతదేశంలో ఎస్.ఎస్.ఐ. విధానం విస్తరించే బాధ్యత 'అగ్ శ్రీ' సంస్థ చేపట్టింది.

2010లో స్థాపించబడిన అగ్ శ్రీ అన్న సామాజిక సంస్థ భారత

దేశంలో చెరకు పండించే అన్ని ప్రాంతాలలోని రైతులతో కలిసి పనిచేస్తూ, ఎస్.ఎస్.ఐ. విధానాన్ని పరీక్షించి, మెరుగుపరచి, ప్రోత్సహిస్తోంది. భారత దేశంలోని వివిధ వ్యవసాయ-జీవావరణ ప్రాంతాలలో శ్రీ మరియు ఎస్.ఎస్.ఐ. విధానాలను ప్రోత్సహిస్తూ, పెట్టుబడి ఖర్చులను, నీటి వినియోగాన్ని తగ్గిస్తూ, దిగుబడులు పెంచడానికై ఈ సంస్థ కృషి చేస్తోంది.

ఇప్పటి వరకూ, చెరకు మిల్లులు మరియు ప్రభుత్వేతర సంస్థల సహకారంతో, అగ్‌శ్రీ సంస్థ ఎస్.ఎస్.ఐ. విధానాన్ని యు. పి., ఒరిస్సా, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్ మరియు మహారాష్ట్ర రాష్ట్రాల్లో దాదాపు 1000 ఎకరాలకు పైగా విస్తీర్ణంలో పరీక్షించి చాలా మంచి ఫలితాలను సాధించింది. అన్ని క్షేత్రాలలో దిగుబడి గణనీయంగా పెరిగింది. వేలాదిమంది రైతులకు ఎస్.ఎస్.ఐ. విధానాన్ని మరింతగా మెరుగుపరిచేందుకు, వివిధ రకాలు ఎలాంటి ఫలితాలను ఇస్తాయి అన్న అంశాలపై కూడా అగ్ శ్రీ సంస్థ కృషి చేస్తోంది.

ప్రస్తుతం అవలంబిస్తున్న ఎస్.ఎస్.ఐ. విధానం చాలా ప్రాథమికమైనది. ఈ విధానాన్ని మరింత సమర్ధవంతంగా చేసి, ఖర్చును మరింత తగ్గించడానికి ముందు ముందు ఇంకా ఎన్నో మార్పులు, చేర్పులు చేయవలసి ఉంది. నారు మడి ఏర్పాటు ప్రక్రియకు ప్రమాణాలు రూపొందించగలిగినట్లైతే ఎస్.ఎస్.ఐ. విధానాన్ని మరింత విస్తృతం చెయ్యడం సాధ్యపడుతుంది. ప్రస్తుతం ఆగ్ శ్రీ నిమగ్నమై ఉన్న పని అదే. వరి పంటలో శ్రీ వరి పద్ధతిలా, ఎస్.ఎస్.ఐ. పద్ధతిలో కూడా చెరకు సాగు ఉత్పాదకత మరియు నాణ్యత పెరిగే అవకాశం చాలా ఉంది. చెరకు పంటలో నీటి వినియోగం తీవ్రంగా ఉంటుంది. కాబట్టి, ఎస్.ఎస్,ఐ. పద్ధతి నీటి సంక్షోభాన్ని తగ్గించగలదు. చెరకు పంటకు పెరుగుతున్న డిమాండుకు తగిన ఉత్పత్తి సాధించాలంటే, వనరులు తక్కువగా వినియోగిస్తూ, సాగు ఖర్చులను తగ్గిస్తూ ఉత్పాదకత పెంచగల ఎస్.ఎస్.ఐ. ఒక్కటే పరిష్కారంగా కనిపిస్తోంది. జీవావరణంపై ప్రతికూల ప్రభావం తక్కువగా చూపే, ఈ పర్యావరణ హితమైన విధానం భారత దేశంలో వేగంగా విస్తరించడంతో బాటు, క్యూబా వంటి ఇతర దేశాలకు కూడా వ్యాపిస్తుంది. కొన్ని రోజులకి భారతదేశంలో, అన్ని చెరకు తోటల్లో ఎస్.ఎస్.ఐ. విధానమే ప్రామాణిక సాగు పద్ధతి కాగలదు. అందుకు ఇంకా కొంత సమయం పట్టవచ్చు. కానీ, రాబోయే పదేళ్ళ కాలంలో, కేవలం భారతదేశంలోనే కాక, ఇంకా చాలా ఇతర దేశాలలో కూడా చిన్న, మధ్యతరహా రైతులు అందరూ ఎస్.ఎస్.ఐ. విధానాన్నే తప్పక పాటిస్తారు. అయితే, ఇందుకుగాను ప్రభుత్వ మరియు ప్రైవేటు రంగాల తోడ్పాటు అవసరం అవుతుంది. ఎస్.ఎస్.ఐ. విస్తరణకు ప్రభుత్వ-ప్రైవేటు రంగాల భాగస్వామ్య (పబ్లిక్-ప్రైవేట్ పార్టనర్‌షిప్) పద్ధతి అత్యంత సమర్థవంతమైన మార్గం.

ఎస్.ఎస్.ఐ. విధానాన్ని మరింతగా విస్తరించడంలో అడ్డంకులు లేకపోలేదు. పరిజ్ఞానాన్ని పంచడం, ప్రభుత్వరంగ తోడ్పాటుతో నడిచే చెరకు పరిశోధనా స్థానాలతో పనిచెయ్యడం మరియు చక్కెర రికవరీ శాతం పెరిగితే వారికే మంచిది కాబట్టి, చక్కెర పరిశ్రమ కూడా ఇందులో పాల్గొనేలా చెయ్యడం అన్నవి ముఖ్యమైన సవాళ్ళు.

వ్యావహారిక సవాళ్ళతో బాటుగా, కొన్ని పరిశోధనా సంబంధిత అంశాలను కూడా ఇంకా పరిశీలించవలసి ఉంది. ఉదా. బడ్-చిప్స్ యొక్క నాణ్యతను పెంచడం, బడ్-చిప్ లను చెరకు నుండి వేరు చేసే ప్రక్రియను వేగవంతం చెయ్యడానికి, అందుకు అనువైన పరికరాలను రూపొందించడం, నాణ్యత పోకుండా వేరుచేసిన బడ్స్ (అంకురాలు)ను నిలువచేసుకోవడం, రైతులకు నారు తక్కువ ధరలో, అందుబాటులో ఉండేవిధంగా నర్సరీ పెంపకానికయ్యే ఖర్చు తగ్గించడం. ఉన్న తక్కువ నిధులతోనే అగ్ శ్రీ వీటిలో కొన్ని అంశాల మీద దృష్టి పెడుతోంది. ◆

**Dr.Biksham Gujja**
E-mail : bg@agsri.com
**Dr.U.S.Natarajan**
E-mail : natarajan@agsri.com
For more information: www.agsri.com

ఆంగ్లమూలం :

లీసా ఇండియా సంపుటి 15, సంచిక 1 మార్చి 2013



తోటల దగ్గరకు వచ్చి ఉత్పత్తిని తీసుకెడుతున్న రీటైలర్లు

# మెరుగైన ఆదాయంకోసం మార్కెట్ల అనుసంధానం

**శ్రీనాథ్ దీక్షిత్, కె.ఎ. గోపీనాథ్, ఎల్. ఉదయ్ కిరణ్ మరియు బి. అనురాధ**

**రైతులకు మెరుగైన ఆదాయం లభించేలా చెయ్యాలంటే, మార్కెట్ లంకెలను ఏర్పరచడం అత్యంత కీలకం. మార్కెట్ లంకెలు ఏర్పరచాలంటే, డిమాండు మరియు సరఫరా పరిస్థితిని, తాత్కాలికంగా నిలువచేసే వసతులను, రవాణా సౌకర్యాలను మరియు మార్కెట్ల అందుబాటు గురించి పూర్తి అవగాహన ఏర్పరచుకోవాలి. జాతీయ వ్యవసాయ నవకల్పనా పథకం (నేషనల్ అగ్రికల్చరల్ ఇన్నోవేషన్ ప్రాజెక్ట్) రైతులలో ఉమ్మడి మార్కెటింగ్ చొరవలను ప్రోత్సహించి, రైతుల బేరమాడే శక్తిని పెంచడానికి తోడ్పడింది.**

గ్రామీణ ప్రాంతాలలో చాలామంది అతి తక్కువ జీవనాధారం కలిగివున్న వారే. కుటుంబ అవసరాలు పోనూ మిగిలిన పంటని అమ్ముకుంటారు. సాధారణంగా, ఈ పంటను ఎవరికి వారు అమ్ముకోవడం వలన ఉత్పత్తిని కూడగట్టి సమర్థవంతంగా అమ్ముకోవడం జరుగదు. ప్రస్తుతం గ్రామాలలో ఉన్న మార్కెటింగ్ వ్యవస్థలో ఎన్నో ఇబ్బందులు - అసంఘటితంగా ఉండడం, అస్తవ్యస్తంగా ఉండడం, లాభదాయకంగా లేకపోవడం, మధ్యవర్తుల పెత్తనం మరియు నమ్మకంలేని మార్కెటింగ్ మార్గాలు వంటి సమస్యలు ఎదురౌతున్నాయి. మార్కెట్ లంకెలు ఏర్పరచాలంటే, డిమాండు మరియు సరఫరా పరిస్థితిని, తాత్కాలికంగా నిలువచేసే వసతులను, రవాణా సౌకర్యాలను మరియు మార్కెట్ల అందుబాటు గురించి పూర్తి అవగాహన ఏర్పరచుకోవాలి. ఈ విలువ గొలుసులో ఏ దశలో అయినా జోక్యం చేసుకుని, సరుకు రీటైల్ లో అమ్మకం అయ్యే ధరలో రైతుకు ముట్టే వాటాను పెంచాలన్నదే మా లక్ష్యం. రైతుల ఉత్పత్తిని కూడగట్టి, ఉత్పత్తిదారుల సంఘాల ద్వారా అమ్మకం చేయడం

వలన, చిన్న, సన్నకారు రైతులు తమ ఉత్పత్తిని మార్కెట్ చేసుకోవడంలో ఎదురయ్యే అడ్డంకులను అధిగమించవచ్చు.

జాతీయ వ్యవసాయ నవకల్పనా పథకం (నేషనల్ అగ్రికల్చరల్ ఇన్నోవేషన్ ప్రాజెక్ట్) లో భాగంగా వ్యవసాయ ఉత్పత్తిని కూడగట్టి అమ్మడాన్ని ప్రోత్సహించడంపై దృష్టిపెట్టడం జరిగింది. దీనివలన మార్కెటింగ్ చెయ్యడానికి సరిపడా ఉత్పత్తి పోగుపడడంతో బాటు రైతుల యొక్క బేరమాడగల శక్తి కూడా పెరుగుతుంది. రైతులకు లాభాలు సరిగ్గా రాకపోవడానికి కారణం వారికి గిట్టుబాటు ధరలు రాకపోవడమే అన్న విషయం కనుగొనడం వలన, రైతులకు మంచి ధర లభించేలా చెయ్యడమే ఈ ప్రాజక్టు యొక్క ముఖ్యోద్దేశ్యం. ''మెరుగుపరచిన వ్యవసాయ వ్యవస్థల ఉత్పాదకత మరియు సమర్థవంతమైన తోడ్పటు వ్యవస్థల ద్వారా వర్షాధార ప్రాంతాలలో సుస్థిర గ్రామీణ జీవనోపాదులు'' అన్న పేరుగల ప్రాజక్టు ఆంధ్ర ప్రదేశ్, తెలంగాణా రాష్ట్రాలలోని అదిలాబాద్, అనంతపుర్, కడప, ఖమ్మం, మహబూబ్‌నగర్, నల్గొండ, రంగారెడ్డి మరియు వరంగల్ జిల్లాలలో 2007-2012 మధ్య కాలంలో చేపట్టబడింది.

## కంది పంట విలువవృద్ధి మరియు మార్కెటింగ్

రంగారెడ్డి జిల్లాలోని ఇబ్రహింపుర్ క్లస్టర్‌లో అనేకమంది రైతులు కంది పంటను సాగుచేస్తారు. కంది పంటకు విలువ వృద్ధి కల్పించడానికి, విలేజ్ ఆర్గనైజేషన్ (వి.ఒ. గ్రామ సంఘం) పేరిట, రోజుకు ఒక టన్ను సామర్థ్యం కల పప్పుమిల్లు ఒకటి ఏర్పటుచేయబడింది. ఈ చొరవ ''ఇబ్రహింపుర్ గ్రామ స్నేహ సంఘం ఎస్.పి.ఎం.దాల్ ప్రాసెస్సింగ్ యూనిట్''గా రంగారెడ్డి జిల్లా, డిస్ట్రిక్ట్ ఇండస్ట్రీస్ సెంటర్ (జిల్లా పారిశ్రామిక కేంద్రం)లో నమోదు చేయబడింది. వివిధ ఎస్.హెచ్.జి.ల నుండి ఎంపిక చేయబడ్డ 5 మంది సభ్యుల కమిటీ ఒక దాల్ ప్రాసెస్సింగ్ గ్రూప్‌గా ఏర్పడి వి.ఓ. తరఫున ఈ యూనిట్‌ను నడుపుతోంది. నాన్-పెస్టీసైడల్ మానేజ్మెంట్ (ఎన్.పి.ఎం.) పద్ధతిలో ఉత్పత్తిచేసిన కంది పంటను కొని, పప్పుగా చెయ్యడానికి సభ్యులకు రెండు లక్షల రూపాయలు రివాల్వింగ్ ఫండ్ (ఆవృత నిధి)గా ప్రాజక్టు నుండి అడ్వాన్సుగా అందించబడింది. అంతేకాక, మరొక నాలుగు లక్షల రివాల్వింగ్ ఫండ్, ఎస్.పి.ఎం. ద్వారా పండించిన కంది పంటను కొనుగోలు చెయ్యడానికై బుదల్ పుర్, బాసిరెడ్డిపల్లి, బొంపల్లి గ్రామాలలోని వాటర్షెడ్ ప్రాంతాలకు అడ్వాన్సుగా ఇవ్వబడింది. కంది పంటను కొనుగోలు చేసే పని వివిధ ఎస్.హెచ్.జి. సంస్థలు చేపట్టి, 2010-2011 సంవత్సరంలో ప్రాసెస్సింగ్ చెయ్యడానికి 8 టన్నుల కందులను కొన్నారు.(చూ. పట్టిక1)

**పట్టిక 1: ఎస్.హెచ్.జి.లు సేకరించిన కంది పంట వివరాలు**

| గ్రామం | ఎస్. హెచ్.జి | అప్పు మొత్తం (రూపాయలలో) | కొనుగోలు చేసిన మొత్తం (టన్నులలో) |
|---|---|---|---|
| ఇబ్రహింపుర్ | చైతన్య | 1,00,000 | 2.48 |
| బాసిరెడ్డిపల్లి | స్వాతి | 2,00,000 | 3.75 |
| బొంపల్లి | మహాలక్ష్మి | 45,000 | 1.22 |
| బొంపల్లి | బిసిమిల్ల | 20,000 | 0.52 |
| మొత్తం | | 3,65,000 | 7.97 |

మిల్లు ఆడి చూసినప్పుడు గ్రేడ్-1 పప్పు 58%, గ్రేడ్-2 రకం పప్పు 12% వచ్చాయి. మొత్తంమీద 70% వరకూ పప్పు వచ్చింది. అవస్థాపన సౌకర్యాలకు ఇచ్చిన అద్దె ఖర్చు కూడా కలుపుకుంటే క్వింటాలు కందులు పప్పు చెయ్యడానికి రూ.550 వరకూ ఖర్చు అయ్యింది. మూడవ రకం కందిపప్పు, పిండి మరియు పొట్టు వంటివి ఎస్.హెచ్.జి.లు తీసుకోలేదు. వాటికి నామమాత్రంగా కిలో రూ. 10 చొప్పున విలువకట్టడం జరిగింది. కొన్ని రకాల ఖర్చులు (అంటే వ్యవస్థాపక వ్యయం కూడా కలిపి) మినహాయించి చూస్తే క్వింటాల్ రూ. 627/- వరకూ లాభం వచ్చినట్లు తేలింది. (చూ. పట్టిక2)

అంతేకాక, ఎన్.పి.ఎం. పద్ధతులలో పండించిన కందిపప్పును మార్కెటింగ్ చెయ్యడానికి నాన్-పెస్టీసైడ్ మానేజ్మెంట్ ఇనిషియేటివ్ గ్రూప్ (ఎన్.పి.ఎం.ఐ.) వారి సేఫ్ హార్వెస్ట్ ప్రైవేట్ లిమిటెడ్ అన్న కంపెనీతో లంకెలు ఏర్పరచడం జరిగింది. ఈ కంపెనీ దేశవ్యాప్తంగా ఎన్.పి.ఎం. ఉత్పత్తిని అమ్మడానికి రీటైల్

**పట్టిక 2: ఎస్.హెచ్.జి.లు పెట్టిన పెట్టుబడి మరియు వచ్చిన లాభాల వివరాలు (2010 - 2011)**

| గ్రామం | ఎస్.హెచ్.జి | సేకరించిన మొత్తం (టన్నులలో) | పెట్టుబడి పెట్టిన మొత్తం (రూపాయలలో) | వసూలు అయిన మొత్తం (రూపాయలలో) | లాభం (రూపాయలలో) |
|---|---|---|---|---|---|
| బాసిరెడ్డిపల్లి | స్వాతి | 3.75 | 1,30,000 | 1,54,471 | 24,471 |
| బొంపల్లి | మహాలక్ష్మి | 1.22 | 44,250 | 53,753 | 9,503 |
| బొంపల్లి | బిసిమిల్ల | 0.52 | 20,500 | 23,326 | 2,826 |
| ఇబ్రహింపుర్ | చైతన్య | 2.48 | 90,000 | 1,03,134 | 13,134 |
| మొత్తం | | 7.97 | 2,84,750 | 3,34,684 | 49,934 |

* తీసుకున్న అప్పు మీద వడ్డీ లెక్కలోకి తీసుకోబడలేదు

చెయిన్లు, హోల్సేల్ షాపులతో నేరుగా లంకెలు ఏర్పరుచుకుంది. సేఫ్ హార్వెస్ట్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీతో బాటు హైదరాబాద్ లోని స్పెన్సర్, హైపర్ మార్కెట్ మరియు హెరిటేజ్ ఫుడ్స్ వంటి రీటైల్ చెయిన్లతో కూడా మార్కెట్ అంకెలు ఏర్పరచుకోవడం జరిగింది.

మామూలుగా స్థానిక మార్కెట్లోనో, దళారులకో అమ్మడం కాక, ఉత్పత్తిని రీటైలర్లకు అమ్మడం వలన రైతులు ఎక్కువ లాభం పొందారు.

## పుచ్చకాయల అమ్మకానికి మార్కెట్ లంకెలు

నల్గొండలోని దుపహాడ్ క్లస్టర్లోని రైతులు పెద్ద సైజు పుచ్చకాయలనుపండిస్తారు.సాధారణంగా,అవికోతకురాకముందే ఒప్పందం కురుర్చుకుని వాటిని దళారులకు అమ్ముతారు. అయితే, దాదాపు 10% ఉత్పత్తిని పనికిరానివిగా ఎంచి దళారులు తీసుకోవడానికి నిరాకరిస్తారు. చాలా సంధర్భాలలో, కొనుగోలుదారులు అమ్మకం ధరని ఉత్పత్తినిబట్టి కాకుండా, ఆ ప్రాంతాన్నిబట్టి నిర్ణయిస్తారు. పుచ్చకాయ సాగు మరియు మార్కెటింగ్లోని సాధకబాధకాలు అధ్యయనం చేసిన తరువాత రైతులతో వరుసగా కొన్ని సమావేశాలు నిర్వహించి, రీటైలర్ల వద్ద అధికంగా అమ్ముడుపోయే చిన్నసైజు పుచ్చకాయల సాగుకు మారేట్లుగా రైతులను ఒప్పించడం జరిగింది. ఒక పేరుపొందిన సంస్థ నుండి ఆ రకం విత్తనాలను కొనుగోలు చేసేలా మరియు వ్యవసాయ నిపుణులు సాగు పద్ధతులలో శిక్షణ ఇచ్చేటట్లుగా ఏర్పాటు చెయ్యబడింది. ఆ తరువాత హైదరాబాద్ లోని హెరిటేజ్ ఫుడ్స్ ఇండియా లిమిటెడ్ (హెచ్.ఎఫ్.ఐ.ఎల్.), ఆదిత్యా బిర్లా రీటైల్ (మోర్), రిలయన్స్ ఇండియా లిమిటెడ్ (ఆర్.ఐ.ఎల్.), స్పెన్సర్స్ రీటైల్, అరుణోదయ ఎంటర్ప్రైజెస్ (తాజా స్టోర్స్), ఐ.టి.సి. చౌపల్ఫ్రెష్, వేదిక్ ఫుడ్స్, ఫ్యూచర్ గ్రూప్ (బిగ్ బజార్) మరియు స్పార్ స్టోర్స్ వంటి అనేకమంది రీటైలర్లతో సంప్రదింపులు జరుపగా, బిగ్ బజారు వారు తప్ప మిగిలిన సంస్థల వారు ఈ మార్కెటింగ్ లంకె భావనను ఒప్పుకున్నారు.

అంతేకాక, ఆదిత్య బిర్లా రీటైల్ మరియు హెరిటేజ్ ఫుడ్స్ ఇండియా లిమిటెడ్ వంటి ప్రముఖ రీటైలర్లతో రైతులకు సమావేశాలు ఏర్పాటుచెయ్యబడ్డాయి. రీటైలర్లతో రైతులు ప్రీ-హార్వెస్ట్ అగ్రిమెంటు (కోతకు ముందు ఒప్పందం) కుదుర్చుకున్నారు. రీటైలర్లకు వచ్చిన ఆర్డర్లను బట్టి పుచ్చకాయలు కొయ్యబడ్డాయి. సీజనులో మొత్తం 26 టన్నుల పుచ్చకాయలు రీటైలర్లకు అమ్మడం జరిగింది. వారి ఉత్పత్తిని గతంలోలా దళారులకో, లేదా స్థానిక మార్కెట్ లోనో అమ్మడం కాక రీటైలర్లకు అమ్మడం వలన రైతులు అధిక లాభాలను పొందారు.(పట్టిక3). చిన్న సైజు పుచ్చకాయల సాగు పట్ల, మార్కెటింగ్ పట్ల రైతులు సంతృప్తిని వ్యక్తం చేసారు.

**పట్టిక 3: వివిధ మార్కెటింగ్ చానెళ్ళ యొక్క సమర్థత**

| వివరాలు | సాంప్రదాయ పద్ధతి | | మార్కెట్ లింకేజి పద్ధతి |
|---|---|---|---|
| | పొలం వద్ద | స్థానిక మార్కెట్లో | |
| ఖరీదు (రూ।కిలో) | | | |
| విత్తనం (కిలో ఉత్పత్తికి) | 0.05 | 0.05 | 0.15 |
| రవాణా | | 0.50 | 1.20 |
| కమీషన్ (10%) | | 0.40 | |
| ఇతర ఖర్చులు | 1.00 | 1.00 | 1.00 |
| మొత్తం ఖర్చు | 1.05 | 1.95 | 2.35 |
| **ధర( రూ। కిలో)** | | | |
| స్థూల ధర | 3.00 | 4.00 | 6.35 |
| నికర ధర | 1.95 | 2.05 | 4.01 |

**పట్టిక 4: మార్కెట్ లింకేజిల వలన మామిడి పంటలో లాభాలు**

| వివరాలు | సంవత్సరం | | | | సగటు | మొత్తం |
|---|---|---|---|---|---|---|
| | **2008** | **2009** | **2010** | **2011** | | |
| కొనుగోలుదారుల సంఖ్య | 1 | 2 | 2 | 5 | | |
| లబ్ధిదారుల సంఖ్య | 1 | 2 | 6 | 9 | | 12 |
| తూనిక పరిమాణం (మొత్తం ఎన్ని టన్నుల) | 8 | 20 | 41 | 164 | | 233 |
| రీటైలర్ నికర ధర (రూ।కిలో) | 10.5 | 13.9 | 14.7 | 13.4 | 13.1 | |
| స్థానిక మార్కెట్ లో నికర ధర ( రూ। కిలో) | 9.0 | 11.2 | 11.3 | 10.8 | 10.6 | |
| మొత్తం లావాదేవీ విలువ (రూపాయలలో) | 96000 | 377000 | 649956 | 2405388 | | 3528344 |
| రైతులకువచ్చిన లాభం (%) | 16.7 | 23.7 | 30.4 | 24.5 | 23.6 | |



నాణ్యతను బట్టి మామిడి కాయలను గ్రేడింగ్ చేస్తున్న మహిళలు

## మామిడి రైతుల బృందాలు

సీజను మొదట్లో అమ్మితే మంచి లాభాలు వస్తాయన్న అభిప్రాయంతో మామిడి రైతులు స్థానిక మార్కెట్టు మొదలవగానే మామిడికాయలను అమ్మడం మొదలుపెడుతూ ఉంటారు. పంట కోతకు వచ్చే సమయానికి రైతులంతా ఒకేసారి ఉత్పత్తిని స్థానిక మార్కెట్ లో అమ్మకానికి పెట్టడం వలన, మార్కెట్‌లో సరుకు ఎక్కువగా చేరి, ధర తగ్గిపోతుంది. ఈ సమస్యను అధిగమించేందుకు, నేరుగా రీటైలర్లతో మార్కెట్ లంకెలు ఏర్పరచుకోవడానికి కడప మరియు నల్గొండ జిల్లాల్లోని క్లస్టర్ గ్రామాల మామిడి రైతులు సంఘాలుగా ఏర్పడ్డారు. ఈ మామిడి సంఘాలలో ప్రెసిడెంట్, వైస్ -ప్రెసిడేంట్. సెక్రటరీ, జాయింట్ సెక్రటరీ, కోశాధికారి మరియు ఇద్దరు కార్య నిర్వాహక సభ్యులు ఉంటారు. నల్గొండ జిల్లాలోని దుపహాడ్ క్లస్టర్ లోని శ్రీ అరబిందో మామిడి రైతుల సంఘం ఇటువంటి సంఘాలలో ఒకటి. అదే విధంగా, కడప జిల్లాలోని బి.వై గుడి లో ఒక మహిళా సంఘం పక్కాహనీ అన్న బ్రాండు పేరిట మామిడి పంటను గ్రేడింగ్ చేసి నగరంలోని మార్కెట్లలో అమ్మింది. ఈ బృందానికి హెరిటేజ్ ఫుడ్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్, రిలయన్స్ ఇండియా లిమిటెడ్, స్పెన్సర్స్, స్పార్,మోర్,ఐ.టి.సి. వారి చౌపల్ ఫ్రెష్ మరియు మెట్రో వంటి అనేకమంది రీటైలర్లతో లంకెలు ఏర్పరచడం జరిగింది. రీటైల్ సంస్థలకు అనుసంధానించడం వలన, ఈ 4 సంవత్సరాల కాలంలో రైతులకు సగటున 24% అధిక లాభాలు వచ్చాయి. (పట్టిక 4) అయితే, వీరు ప్రధానంగా ఎదుర్కొన్న సమస్య ఏమిటంటే, ప్రాజక్టు క్లస్టర్లలోని రైతులు పండించే పంటతో పోలిస్తే ఈ రీటైలర్లు సరఫరా చెయ్యమన్న సరుకు యొక్క పరిమాణం చాలా తక్కువ. ఉదాహరణకి, దుపహాడ్ క్లస్టర్ లో ఒక సీజన్ లో ఉత్పత్తి 250 మెట్రిక్ టన్నుల పైగా ఉంటుంది. రీటైలర్లు సరఫరా చెయ్యమని అడిగిన పరిమాణంతో పోలిస్తే ఇది చాలా ఎక్కువ. కాబట్టి వారు పండించిన పంటను అమ్ముకోవడానికి రైతులు ఇంకా కొన్ని కొత్త మార్కెట్లను వెతుక్కోవలసి ఉంది. ◆

> మాములుగా స్థానిక మార్కెట్లోనో, దళారులకో అమ్మడం కాక, ఉత్పత్తిని రీటైలర్లకు అమ్మడం వలన రైతులు ఎక్కువ లాభం పొందారు

**Sreenath Dixit, K A Gopinath and B Anurahda**
Central Research Institute for Dryland Agriculture (CRIDA), Santoshnagar, Hyderabad - 500 059. INDIA
E-mail : sdixit@crida.in

**L Uday Kiran,** IKISAN, IKISAN Limited No. 1, Nagarjuna Hills, Panjagutta, Hyderabad - 500 082, India

ఆంగ్లమూలం :
లీసా ఇండియా సంపుటి 15, సంచిక 2 జూన్ 2013



సాంప్రదాయ సంచార గొర్రెల కాపరులకు పర్యావరణాన్నీ, సమాజాన్నీ గౌరవించడం నేర్పబడింది.

# మార్పును తట్టుకోవడం : ఒక గొర్రెల కాపరి సందిగ్ధం


## నిత్య సాంబమూర్తి ఘొట్గె


**ఇంటర్నెట్, సెల్ ఫోన్లతో నిండివున్న నేటి సమాచార యుగంలో, ఆందోళన కలిగించే వేగంతో మారుతున్న పరిస్థితులను, సవాళ్ళను ఎదుర్కోడానికి ఒక్క పారంపరిక విజ్ఞానమే సరిపోదు. ఈ మార్పులను తట్టుకొని నిలబడలేక చతికిలబడ్డ వాటిల్లో ఎక్కువగా దెబ్బతిన్నవి చిన్న కమతాలు, పశువులకొట్టాలే. వేగంగా మారుతున్న పరిస్థితులను తట్టుకొని నిలబడడానికి, ప్రస్తుతమున్న విస్తరణ మరియు విద్యావిధానాలను పూర్తిగా మరమ్మత్తు చేయడం రైతులకు ఒక పరిష్కారం కాగలదు.**

ఖందు కొల్పె గొర్రెలను కాచడం తండ్రి నుండి నేర్చుకున్నాడు. అప్పుడే పుట్టిన గొర్రెపిల్లల ఆలనా పాలనా తల్లి నుండి తెలుసుకున్నాడు. తన అత్తయ్యలు, బాబయ్యలు, అమ్మమ్మ, తాతయ్యలకు సహాయపడడం ద్వారా, వారిని గమనించడం ద్వారా మరికొంత నేర్చుకోడం జరిగింది. సుదీర్ఘమైన ఎండాకాలంలో గొర్రెలను కట్టి ఉంచడానికి వుపయోగించుకున్న పొలంలోని రైతు ద్వారా మొక్కల గురించి తెలుసుకున్నాడు. ఇదంతా, విస్తరణ మరియు అభివృద్ధి కార్యకర్తలు, టెలివిజన్, టెలిఫోన్ వాడకాలు రాకపూర్వం సంగతి. ఖందు కొల్పేకి చదవడం, రాయడం రాదు. అతనికి తెలిసిందంతా చెక్కుచెదరక తన జ్ఞాపకాల పొరల్లో నిక్షిప్తమై వున్నదే. ఖందు, భారతదేశంలో మహారాష్ట్రకి చెందిన ధాంగర్ అనే

సంచార గొల్ల జాతికి చెందినవాడు. ఇప్పటికీ భారతదేశంలో, గొర్రెల పెంపకం ఎక్కువగా సాంప్రదాయ పద్ధతిలో జీవనం సాగించే సంచారజాతి గొల్లవారి చేతిలోనే ఉంది.

కొన్ని వందల సంవత్సరాలుగా ఇతని జాతివారు గొర్రెల పెంపకంలోనే వున్నారు. ఈ జాతి యొక్క సమిష్టి జ్ఞానము, తెలివి వీళ్ళ రోజువారీ కార్యక్రమాలలో పాటల రూపంలో, నృత్యాలు, కథల రూపంలో, ప్రత్యేక రాత్రులందు చల్లటి వెన్నెలలో, వేల నక్షత్రాల వెలుతురు నడుమ, ఆరుబయట తరగతులు నడిపే ఊరిపెద్దల దగ్గర వినడం ద్వారా తెలుసుకొంటారు. ఈ జ్ఞాన సంపదని నిక్షిప్తం చేసే పుస్తకాలుకానీ, పేపర్లు, రికార్డులూ కానీ లేవు. అయినా, ఈ జ్ఞానం వంశానుగతంగా ఒకరినుండి ఇంకొకరికి ఆచరణ, అనుభవం, గమనించడం ద్వారా సంక్రమించింది. ఆ జ్ఞానం గొర్రెలపెంపకంలో, గొంగళీలు నేయడంలో, ఆరుబయళ్ళలో నివసించడంలో మరియు వీళ్ళ సంస్కృతిలో ఇమిడిపోయి వుంది.

ఖందు తన కొడుకులను బడికి పంపాడు. పెద్దవాడు మంచి విద్యార్థి, బాగా చదువుకున్నాడు. తండ్రి ప్రోత్సాహముతో కళాశాలకు వెళ్ళి పట్టభద్రుడై ప్రభుత్వ ఉద్యోగం సంపాదించుకోగలిగాడు. తండ్రికి గొర్రెలపెంపకంలో సహాయపడడం మానేసాడు. చిన్నవాడు చదువులో అంత చురుగ్గా లేకపోవడం వల్ల గొర్రెలపెంపకానికి ప్రోత్సహించబడ్డాడు. తరచుగా దగ్గరలో వున్న పశుగణాభివృద్ధి విస్తరణ కేంద్రంలో నడిపే శిక్షణా తరగతులకు హాజరౌతూ, కొత్త కొత్త పథకాలతో, ఆలోచనలతో వచ్చేవాడు. వాటిల్లో కొన్ని గొర్రెలపెంపకంలో ఖందూకి వున్న 50 ఏళ్ళ అనుభవానికీ, వారి జాతికీ మరియూ సాంప్రదాయ విజ్ఞానానికీ పూర్తి భిన్నంగా వుండేవి. నవీన తరగతి గదులలో, ప్రకాశవంతమైన వెలుగుల నడుమ వెలువడ్డవి ఇవి. తరగతి గోడల మీద ప్రస-రించే పాఠాలు, ప్రకాశవంతమైన రంగుల పటాలు ఉపయోగించి యువకులకు బోధన జరిగేది. యువకులు ఇంటికి ఆకట్టుకునే ఆకృతుల్లో, రంగులలో వున్న కరపత్రాలు, వివరణలు పట్టుకుని వచ్చేవారు.

ఒక మధ్యాహ్నపు ఎండలో, చింతచెట్టునీడన విశ్రమించిన ఖందూ మస్తిష్కంలో నేటి ఆధునికత సుళ్ళు తిరిగింది. పోయిన సంవత్సరం అనుకోకుండా కొన్ని గొర్రెలు మృత్యువాత పడ్డాయి. ఖందూ తోటి గొర్రెలకాపరులతో కలిసి శవపరీక్ష చేస్తే అందులో స్పష్టంగా ఆకు ఆకారంలో వుండే లివర్ ఫ్లూక్స్ (అంతర పరాన్నజీవి బద్దెపురుగులు) కనిపించాయి. ఈ సంవత్సరం ఎందుకిన్ని లివర్ ఫ్లూక్స్ కనిపిస్తున్నాయని సంఘం పెద్దలను సంప్రదిస్తే వీటిని దరిచేరనివ్వని ఒకరకమైన జాతికి చెందిన మొక్క ఈమధ్యకాలంలో కనుమరుగయ్యిందన్న నిజం బయటపడింది. గొర్రెలను పోగొట్టుకొనేకన్నా ఈ మొక్క దొరికే ప్రదేశాలలో గొర్రెలను మేతకు తీసుకెళ్ళే ప్రయత్నాలు చేసారు. కానీ అటువంటి భూములు దొరకడం అంత సులభం కాదు. ఈమధ్యకాలంలో పర్యావరణంలో వచ్చిన అనేక మార్పుల మూలంగా విలువైన మొక్కల జాతులు మన పర్యావరణ వ్యవస్థ నుండి త్వరగా అంతరించిపోతున్నాయి.

> చాలా మంది రైతులూ, అభివృద్ధి కార్యకర్తలూ వారికి అందుబాటులో ఉన్న సమాచార రాశిలో కూరుకుపోయారు. ఎక్కువ పరిమాణంలో ఉన్న ఈ సమాచారంలో వారికి సంబంధించిన, వారికి పనికి వచ్చే సమాచారం ఏదో తెలుసుకోవడం వీరికి సమస్యగా ఉంది.

గొర్రెలమేతకు వేరే ప్రదేశాలను వెతుక్కోవడమనే ఆలోచనను అతని రెండోకొడుకు ఒప్పుకోలేదు. శిక్షణా కేంద్రాలలో ఇచ్చిన పురుగునివారణ మందునే పరిష్కారంగా వాడదలిచాడు. తనలాగా శిక్షణ తీసుకున్న తోటి గొర్రెలకాపరుల పిల్లలు కూడా వెంటనే ఆ మందునే ప్రయోగించారు. కొన్నిరోజుల తరువాత గొర్రెలకు గర్భస్రావమైంది. ఇది అసాధారణమైన విషయం. ఇలా ఎప్పుడూ జరగలేదు. ఈ పురుగునివారణ మందుకూ, గర్భస్రావానికీ ఏదో సంబంధమున్నట్లుంది. చూడి గొర్రెలకు ఈ మందు హానికరం అని ఎవరూ చెప్పలేదు. ఖందూ ఈ మందుని తన గొర్రెలకు వాడడం మానేసాడు. ఆధునిక పరిష్కారాలతో సమస్య ఇదే. మందులను సరైన పరీక్షలు జరపకుండానే ఇవ్వడం మూలాన, గొర్రెలకాపరులు నష్టాన్ని భరించాల్సి వస్తోంది. అందుకనే వారు గొర్రెలను ఎదగక మునుపే సంతకు తీసుకుని వచ్చేస్తున్నారు. ఎక్కువకాలం పెంచేందుకు ఆసక్తి చూపించడం లేదు. 2,3 నెలల వయసుకే మార్కెట్టుకి తరలిస్తున్నారు. కానీ గొర్రెల పెంపకం విస్తరణ శాస్త్రజ్ఞులు కనీసం 9 నెలలైనా గొర్రెలను పెంచమని సూచిస్తున్నారు.

''గొర్రెలకాపరుల మాట ఎవరు వింటారు?'' అనుకుంటాడు ఖందూ. కొత్త రకమైన పత్తి విత్తనాలతో పంట పండించే రైతులు కూడా వినరు. ఆ పంట భూముల్లో మేపడం మూలాన వాటికొచ్చే సమస్యలకు ప్రాచీన ఔషధాలు పనిచేయవు, పైగా వైద్య బృందాలు కూడా రోగాన్ని కనిపెట్టలేక పోతున్నాయి. ఫలితంగా ఎన్నో గొర్రెలు మృత్యువాత పడుతున్నాయి. ఈ రోగానికి విరుగుడు కనుక్కోవడం కాకుండా, గొర్రెల జాతిని మార్చమని, లేదా క్రిమిసంహారక మందులు చల్లమని, పురుగునివారణ మందులు వాడమని వైద్యులు అదేపనిగా సూచనలు ఇస్తున్నారు. ఈ మందులేమన్నా క్షేత్రస్థాయిలో విస్తృతంగా పరీక్షించబడినవా? ఈ కొత్త జాతి గొర్రెలు మేతకోసం కొత్త ప్రదేశాలకు వెళ్ళగలవా?, పశుగ్రాస కొరతను, జబ్బులను తట్టుకోగలవా? ''అవును అవి ఏపుగా ఎదుగుతాయి సరే, కానీ మా చేతుల్లోనే చనిపోతే ఎవరికి నష్టం?'' అనుకొన్నాడు ఖందూ. క్రిమిసంహారక మందులు విషపూరితమైన

వాసనలతో వున్నాయి. కానీ, ఎవరు వింటారు తలపాగా చుట్టుకునే వాడు, రాయడం చదవడం రాని, మొబైల్ ఎలా వాడాలో అసలు తెలీని ఈ ముసలి గొర్రెలకాపరి మాటలు?

ఈ రోజు, ఇతని కొడుక్కి ఆధునిక పరికరాలు, ట్రాక్టర్లు, నూర్పుడు యంత్రాలు, పొలందున్నే యంత్రాలు, మోటారు సైకిళ్ళు కావాలి, మొబైల్ కూడా అనుకోండి, ఎందుకంటే అదిప్పుడు బాగా ప్రజాదరణ పొందిన సాధనం కదా! అతనికి కంప్యూటర్, ఇంటర్నెట్ ఎలా వాడుకోవాలో కూడా బాగా తెలుసు. దాని ద్వారా వాతావరణ వివరాలు, మార్కెట్టు సమాచారం స్థానిక గొర్రెల విస్తరణ కేంద్రం నుండి అందుతుంది. కానీ ఈ సమాచారం బాగా అవసరమైనప్పుడు బయటకు తీయడం కష్టం, పైగా త్వరగా మర్చిపోవడం జరుగుతుంది. పాతరోజుల్లో అయితే ముఖ్యమైన సమాచారాన్ని ప్రజలదైనందిన జీవితాల్లో, వారి సంస్కృతిలో రోజువారీ కార్యక్రమాల్లో ఇమిడిపోయేట్టుగా చేసేవారు. గొర్రెలను చక్కగా, ఒక పద్ధతి ప్రకారం పెంచకపోతే దేవుడు క్షమించడు అని చెప్పేవారు. పరిసరాలనూ, సమాజాన్నీ గౌరవించడం నేర్పేవారు. పొలాల్లో ఒక ప్రత్యేకమైన గడ్డి మొలిచిన తరువాతే గొర్రెలను మేతకు తీసుకెళ్ళేవారు. ఖందూ కొడుకు, అతని స్నేహితులు వీళ్ళ కులపెద్దలను చూసి నవ్వుకునేవారు. వీళ్లు ఆధునిక పద్ధతులు, శాస్త్రీయత తెలియని మూర్ఖులని అనుకునేవారు.

కానీ, ఏది శాస్త్రీయత, ఏది ఆధునికత, ఏది విజ్ఞానము, ఏది వివేకము... లివర్ ఫ్లూక్స్‌ని దగ్గరకు రానివ్వని ఒక ప్రత్యేకరకమైన గడ్డి మొలిచే భూములు అరుదుగా కనిపిస్తున్నాయని, ఇలాగే ఎన్నో విలువైన గడ్డి మొక్కలు మరియు మందు మొక్కలు కూడా కనుమరుగవుతున్నాయి. సీసాల్లో మందు సులభంగా దొరకడం మూలాన, ప్రకృతి నుండి లభించే మందులు చాలా అరుదుగా మారాయి. ఎక్కడ చూసినా ప్రజలు వాతావరణ మార్పుల గురించి మాట్లాడేది వింటూ వుంటాం, నిజమే, ఈ కాలంలో వర్షాలెప్పుడు పడతాయో, కాలాల స్థితిగతులు అంచనా వేయడం చాలా చాలా కష్టం అవుతోంది. సహజమైన కాలగమనాన్ని, వాతావరణంలో వచ్చే మార్పులని గమనించి కదిలే గొర్రెలకాపరుల లెక్కలు ఇప్పుడు చెల్లవు. నిజమే, సాంప్రదాయ పద్ధతులు ఇకముందు పనికిరావేమో. అయితే ఇప్పటి ఆధునిక పద్దతులు కూడా పనికిరావు. ఖందూకి ఈ విషయం ఖచ్చితంగా తెలుసు.

## సమస్య ఎక్కడుంది?

ఈ సందేహంలో చిక్కుకున్నది, ఒక్క ఖందూ లాంటి గొర్రెలకాపరులే కాదు, ప్రపంచవ్యాప్తంగా సన్న, చిన్నకారు రైతులందరూ కూడా. ముఖ్యంగా ఇది పారిశ్రామిక వ్యవస్థ ముందు నుండి, నేటి మొబైల్ ఫోన్లు, ఇంటర్నెట్‌తో నిండి వున్న ఆధునిక సమాచార యుగంలో విసిరివేయబడ్డ ఆర్థిక వ్యవస్థల్లో పారంపరిక విజ్ఞానం నేటి సవాళ్లను, మార్పులను ఎదుర్కోడానికి సరిపోవడం లేదు. వివిధ స్థాయిల్లో ఒకేసారి ఊపిరాడనన్ని మార్పులు సంభవిస్తున్నాయి. చిన్న పొలాలు, పశువులకొట్టాలమీద వీటి ప్రభావం ఎక్కువై, అవి ఈ మార్పులను తట్టుకొని నిలబడలేక, కలవరపెడుతున్న వేగంతో కనుమరుగై పోతున్నాయి. అలాగైతే, మరి సమస్య ఎక్కడున్నట్లు?

సమాచారంలోని విషయం

వ్యవసాయం, పశుసంరక్షణ పరిజ్ఞానం ఒక విధంగా వేల సంవత్సరాలుగా మానవాళి ప్రోదిచేసుకున్న జ్ఞానం. దీనికి నిరంతరాయంగాకొత్తసమాచారం,విజ్ఞానంవచ్చిచేరుతోంది.గతంలో సమాచారం నెమ్మదిగా ప్రయాణించేది, అభివృద్ధిచెందుతున్న చాలా సమాజాలకు, వేరే సమాజాల్లో జరుగుతున్న పురోగాభివృద్ధి తెలిసేది కాదు. కానీ, ఈరోజుల్లో అంతా మారిపోయింది. సమాచార విప్లవం మూలంగా వర్తమానంలోని విషయాలు ఒక మీట నొక్కిన వెంటనే తెలుస్తున్నాయి. కానీ ఇప్పటికిప్పుడు సవరించబడ్డ సమాచారాన్ని గ్రహించి, ఆచరించడం అన్నికాలాల్లో సాధ్యమయ్యేపనికాదు, ముఖ్యంగా చిన్న పొలాల విషయంలో ఇది అంత సులభం కాదు.

సమాచార పరిమాణం

వ్యవసాయ సమాజాలు, నిరంతరం పెరుగుతున్న మార్కెట్ డిమాండ్‌కీ సమాజంలో వస్తున్న మార్పులకీ తగ్గట్టు స్థాయిని పెంచుకోవాల్సిన పరిస్థితిలో, ఒక అసాధారణమైన సంధికాలంలో చిక్కుకున్నాయి. అయినప్పటికీ, చాలా వరకూ రైతులు, సామాజిక కార్యకర్తలు కూడా ఒక్క సమాచార పరిమాణం లోనే తలమునకలుగా ఉన్నారు. పనికివచ్చే, పొంతనగల సమాచారాన్ని, పనికిరాని దానినుండి విడదీయడమనే సమస్యలో కూరుకుపోయారు.

సమాచారమార్పిడికి మూలం

ఇటీవలి కాలంలో సమాచారాన్ని అందించే - అభివృద్ధి కార్యకర్తలు, ఎన్.జి.ఓ.లూ, ప్రభుత్వ విస్తరణాధికారులూ, రేడియో, టి.వి., ఇంటర్నెట్, వార్తాపత్రికలూ, సమాచార పత్రికలూ, మార్కెట్టు ప్రతినిధులూ, మొబైల్ సమాచారం వంటివి బాగా పెరిగాయి. అయినప్పటికీ, ఈ సమాచార భారమంతా రైతులకు, గొర్రెల కాపరులకు, పనికొచ్చే విజ్ఞానంగా మార్పుచెందాలని లేదు. వారికి కూడా ఏ సమాచారం నమ్మదగినదో, ఏది నమ్మదగినది కాదో, ఎవరిని నమ్మాలో, ఎవరు తమని తప్పుదోవ పట్టిస్తారో కూడా తెలియడం లేదు.

సమాచార ప్రవాహం

సమాచార ప్రవాహం ఎక్కువగా ఒకపక్కే వుంటుంది. ప్రయోగశాలల నుండి గానీ, పరిశోధనాకేంద్రాల నుండీ గానీ, లేదా

విధానకర్తల నుండి గానీ రైతులకు, గొర్రెల కాపరులకు, బహుశా విస్తరణ కార్యకర్తల ద్వారా చేరవేయబడుతుంది. ఇందులో సమాచారం ఒకరినుండి ఒకరికి అందుతున్నప్పుడు ఖచ్చితంగా కొంతమేరకు విషయం నష్టపోవడం జరుగుతుంది. రైతుల, గొర్రెలకాపరుల వివిధరకాలైన సమస్యలన్నింటినీ గ్రహించి సరైన పద్ధతిలో తిరిగి పరిశోధనా స్థానాలకు, విధానకర్తలకు చేరేవేసే యంత్రాంగం ఏదీ లేదు. అందువల్ల, ఎన్నో కొత్త కార్యక్రమాలూ మరియూ ప్రణాళికలు కుంటుపడి, తక్కువ సాఫల్యం పొందుతున్నాయనడంలో పెద్ద ఆశ్చర్యపడాల్సిన పనిలేదు. ఇది చాలా దురదృష్టకరమైన విషయం, ఎందుకంటే సాధారణంగా ఇటువంటి కార్యక్రమాల అమలుకు ఎంతో ధనం ఖర్చుపెట్టడం జరుగుతుంది.

## మార్పు యొక్క ఆవశ్యకత

ముందుకుపోవడానికి దారికావాలంటే ప్రస్తుతమున్న విస్తరణ మరియు విద్యావిధానం, దాని లక్ష్యాలూ, నిర్వహణ విధానం సంపూర్ణంగా మార్పు చేయాల్సిన అవసరం వుంది.

విషయాన్ని సరిదిద్దడం

దీనికి వ్యవసాయపద్ధతులను తాజాగా గమనించవలసిన అవసరం వుంది. ప్రాచీన పద్ధతులను పోగొట్టుకునే ప్రమాదం నుండి కాపాడుకొనడానికి, వాటిని తిరిగి చూడవలసిన అవసరం వుంది. క్లిష్టమైన పర్యావరణ, ఆరోగ్యసంబంధమైన విషయాల గురించి అందులో జవాబులున్నాయా? ఏ విషయాన్ని సవరించి, దాచుకోవలసిన అవసరం వుంది? దేనిని యధాతధంగా కాపాడుకోవాల్సిన అవసరముంది? ఈ విజ్ఞాన భాండాగారంలో వచ్చి చేరుతున్న ఆధునిక పద్ధతులలో ఏది కాలానికి తట్టుకుని నిలబడగలిగిన సామర్థ్యం కలిగివుంది? అని పరీక్షించాల్సిన అవసరం వుంది. ఏ పద్ధతులు నిలకడలేని మార్కెట్టుని, అనూహ్యా వాతావరణ పరిస్థితులను తట్టుకొని నిలబడగలవు? ఏ విభాగాన్ని వేరుచేయడం (అనగా జల్లెడపట్టడం) మరియు జాగ్రత్తగా సంకలనం చేయడం మూలంగా అవసరమైన వారికి సమగ్రమైన విజ్ఞానము అందుబాటులో తేగలము? ముఖ్యంగా విస్తరణ కార్యకర్తలకూ, రైతులకు మరియు గొర్రెల కాపరులకు పనికివచ్చే విధంగా.

విజ్ఞానము దాచుకొనడం మరియు తిరిగి పొందడం

క్లౌడ్ టెక్నాలజీ నుండి జన్యుసంబంధమైన పదార్ధాలను భద్రపరిచే కోల్డ్ స్టోరేజీల వరకు విజ్ఞానసంపదని దాచేవిధానాలు మునుపటికన్నా భిన్నంగా ఉన్నాయి. అయినప్పటికీ, సమాచారం అందుబాటు, తిరిగిపొందడం అన్నది బడుగువర్గాల వారికి సమస్య కావచ్చు. ప్రజలకు అవసరమైన సమాచారాన్ని, అనగా వివిధ కార్యక్రమాలలో కలిగిన విజయాలను, లోటుపాట్లను ప్రస్తావిస్తూ, ఆ కార్యక్రమాలలో చేపట్టిన ఆచరణ పద్ధతులను నిష్పాక్షికంగా, నిజాయితీతో చేసిన వివరణాత్మక పరిశీలనలను ప్రజలకు అందుబాటులో వుంచాలి. విస్తరణ కార్యకర్తలకు ఇటువంటి సైట్‌లను చూపిస్తే వారు ఈ సమాచారాన్ని రైతులతో, గొర్రెల కాపరులతో పంచుకోగలరు.

శిక్షణామార్గాలను పరిశీలించడం

రకరకాల మనుషులు వివిధ మార్గాలలో నేర్చుకుంటారు. వారు నేర్చుకునే విధానాన్ని నిర్ధారించడంలో వారి సంస్కృతి ముఖ్యపాత్ర పోషిస్తుంది. దీని మీద చెప్పుకోదగ్గ అధ్యయనాలే జరిగాయి కానీ, విజ్ఞానాన్ని పంచుకునే పద్ధతుల్లో వేగంగా వస్తున్న మార్పులవల్ల, ఇంకా ఎక్కువ కృషి జరగాల్సిన అవసరం వుంది. విభిన్న సమూహాలకు తగ్గట్టుగా విస్తరణ కార్యక్రమాలను రూపొందిస్తున్నపుడు ముఖ్యంగా దృష్టిలో వుంచుకోవాల్సిన విషయం, వ్యవసాయ సమాజాలు ఆచరణ ద్వారానే నేర్చుకోగలవు అన్నది. వ్యవసాయ సమాజాలకు శిక్షణ ద్వారా ఈ పద్ధతులన్నీ జాగ్రత్తగా అందే విధంగా మరియు ఆచరణలో కలిగే ఇతర ప్రభావాల (సైడ్ ఎఫెక్ట్స్) గురించీ ముఖ్యంగా వాతావరణం వల్ల కలిగే దుష్ప్రభావాలు తెలియజేసి, అందుకొరకు సరిపడా సమాయాన్ని కేటాయించాలి. తరచూ క్షేత్రస్థాయి సందర్శనలు చేస్తూ అక్కడి వ్యవసాయ సమాజాలకు సంబంధించి, కొత్త పద్ధతులను గ్రహించి ఆచరించడంలో వారికి వున్న సమస్యలు గుర్తించి, వాటిని నమోదు చేసి, ఎక్కడైతే ఈ పద్ధతులు రూపొందించబడ్డాయో అట్టి ప్రయోగశాలలకు తిరిగి పంపాలి.

రైతులకు, గొర్రెల కాపరులకు కూడా సమాచారము ఎక్కడెక్కడ దొరుకుతుందో చెప్పి, ఆ సమాచారాన్ని గ్రహించే విధానాన్ని కూడా తెలియజెప్పాలి. ఇంటర్నెట్ ఆ సమాచారాన్ని అందించడంలో ముఖ్య భూమిక పోషిస్తోంది, కానీ, ఇంతకు ముందు చెప్పినట్టు ఎక్కువ సమాచారము అందుబాటులో ఉండడం కూడా అనర్ధదాయకమే.

సమాచార ప్రవాహాన్ని దారి మళ్ళించడం

సమాచార ప్రవాహం ఎప్పుడూ ఒక దిశలో ఉండకూడదు. ఇంతకాలం సామాజిక కార్యకర్తలను మార్పుకు ప్రతినిధులుగా, ప్రయోగశాలల నుండి కొత్త ఆలోచనలను క్షేత్రస్థాయికి అందించే ఏజెంట్లుగానే చూడడం జరిగింది, కానీ, సమాజంలో వారు విశేషమైన పాత్రని నిర్వర్తించగలరని, వాళ్ళు క్షేత్రస్థాయి నుండి ప్రయోగశాలలకు, వ్యవసాయ సమాజాలు ఎదుర్కొనే కొత్త సమస్యల గురించిన సమాచారాన్ని అందించగల విలువైన వ్యక్తులన్న విషయాన్ని విస్మరించడం జరిగింది.వీరు కీలకమైన అనుసంధానకర్తలు. వ్యవసాయ సమాజాలకు, శాస్త్రజ్ఞులకూ మధ్య, అక్కడి నుండి విధానకర్తలకు సమాచారాన్ని చేరవేయడానికి, క్షేత్ర సమాచారాన్ని నమోదు చేసి, విశ్లేషణ మరియు తదుపరి చర్యల



*చిన్న రైతులు, గొర్రెల కాపరులు, వారి చుట్టూ వస్తున్న మార్పుల వలన తీవ్రంగా నష్టపోతున్నారు.*

కొరకు వృత్తి నిపుణులకు అందించే ముఖ్య పాత్ర పోషించాలి. వీరి వృత్తిలో భాగంగా గొర్రెల మరణాల గురించి, రోగాల గురించి సర్వేలు, క్షేత్రస్థాయిలో జరుగుతున్న మార్పులను నమోదు చేయడం, పంట విజయాలూ, వైఫల్యాలు, కొత్త టెక్నాలజీని స్వీకరించడం, నిర్వహణ విధానాలూ మొదలగునవి చేర్చాలి. ఇలా ప్రోత్సహించడం ద్వారా, సమాజం పట్ల వారికున్న దృక్పథం మారడమేకాక అంతకంతకు సంధిగ్ధావస్థలో పడుతున్న సమాజం యొక్క భవిష్యత్తును తీర్చిదిద్దడంలో మరింత విశేషమైన పాత్రని పోషించగలరు.

ఇంకా చేయాల్సినది ఎంతో ఉంది. మార్పు అనే గాలి సమాజాలపై వీచినప్పుడల్లా, అది కొంత నష్టాన్ని కలిగిస్తుంది. కొంత సహాయాన్ని, మరికొంత ఆశని మోసుకొస్తుంది. ఇలాంటి గాలులు వీరిపై వీచినప్పుడల్లా, ఖందూ లాంటి పశువులకాపర్లు అనివార్యముగా లొంగిపోకతప్పదు. ఎవరన్నా, అభివృద్ధి ప్రయత్నాల మూలంగా నష్టం కన్నా కాస్త నమ్మకం, సహాయము లభిస్తాయని ఆశపడతారు. ఎంతోకాలంగా వారు పోగుచేసుకున్న జ్ఞానం కొంత, మరియు తరతరాల వారి అనుభవం వారిని భవిష్యత్తులోకి జాగ్రత్తగా ప్రయాణింపచేయగలదు.

**Nitya Sambamurti Ghotge**
ANTHRA
F. Lantana Gardens, NDA Road,
Bavdhan, Pune - 411021.
Maharashtra, India.
E-mail: anthra.pune@gmail.com

ఆంగ్లమూలం :

లీసా ఇండియా సంపుటి 15, సంచిక 3 సెప్టెంబర్ 2013